www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజావినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజావినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -363 శుక్రవారం 10 ఏప్రిల్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## కాళేశ్వరం మరమ్మతులు వెంటనే చేపట్టండి

మూడు బ్యారేజీలను వినియోగంలోకి తేవాలి

పనుల పర్యవేక్షణకు మేడిగడ్డ వద్ద బేస్ క్యాంప్ ఏర్పాటు

: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్/ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):** కాళేశ్వరంలోని మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. మరమ్మతులకు సంబంధించిన ఏజెన్సీలన్నింటినీ భాగస్వామ్యం చేయాలని సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. నీటిపారుదల**మిగతా 2లో...**

## మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

భారీగా పోలింగ్ శాతం నమోదు

అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ ప్రశాంతం





**న్యూఢిల్లీ,/ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):** అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఇసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 75.01 శాతం పోలింగ్ నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం అసోం (126), కేరళం (140), పుదుచ్చేరి (30) లలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఈ ఎన్నికల పోలింగ్ వేళ.. ఏర్పాట్లను ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఆయా రాష్ట్రాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. **మిగతా 2లో...**

## జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం

డిప్యూటి సీఎం భట్టి వెల్లడి



## సెల్ఫీ పిచ్చి ముగ్గురు యువతుల ప్రాణాలు తీసింది

జలపాతం వద్ద సెల్ఫీ దిగుతూ ముగ్గురు మృత్యువాత

మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స

2లో.



## రాజకీయ ఫ్లెక్సీలపై ఏపీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం..

ఎవరిని ధ్వంసం చేస్తారని ప్రశ్న

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు, ద్వేషపూరిత రాజకీయ ఫ్లెక్సీలు

పోలీసుల నిర్లక్ష్యంపై ఏపీ హైకోర్టు సీరియస్

పోలీసుల నిర్లక్ష్యం వల్లే సమస్యలు పునరావృతం అవుతున్నాయని వ్యాఖ్య

సీఎంను అవమానిస్తే 5 కోట్ల మందిని అవమానించినట్లేనని స్పష్టీకరణ

2లో.



## డిజిటల్ పేమెంట్స్ : గంట సేపు ఆగాల్సిందే...

డిజిటల్ మోసాల కట్టడికి ఆర్బీఐ కీలక ప్రతిపాదన

రూ.10,000 దాటిన లావాదేవీలను గంటపాటు నిలిపివేయాలని సూచన

గంట సమయంలో లావాదేవీని రద్దు చేసుకునేందుకు వెసులుబాటు

వృద్ధుల కోసం అదనపు భద్రతా చర్యల ప్రతిపాదన

2లో.




## రాజీకొస్తారా..!

నేడు ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు -ఏర్పాట్లు జరుగుతున్నాయి : పాకిస్తాన్

కొనసాగుతున్న ఉద్రిక్తతలు.. -లెబనాన్‌పై ఆగని ఇజ్రాయిల్ దాడులు

కుదరకపోతే మళ్లీ దాడులు : ట్రంప్ -యుద్ధమా? కాల్పుల విరమణా? ట్రంప్ తేల్చుకోవాలి : ఇరాన్

**టెహ్రాన్: / ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు ఇస్లామాబాద్ వేదికగా శుక్రవారం జరగనున్నాయి. మరోపక్క లెబనాన్‌పై దాడులు కొనసాగుతున్నాయి. దీనిపై స్పష్టత వచ్చేవరకు హోర్ముజ్ జలసంధిని తెరిచేది లేదని ఇరాన్ ప్రకటించింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిజమైన ఒప్పందం జరిగే వరకూ సైన్యం అక్కడే ఉంటుందని తెలిపారు. అయితే హిజ్బొల్లాను నిరాయుధీకరణ చేసేందుకు, ఇరు దేశాల మధ్య "శాంతి సంబంధాలను" నెలకొల్పేందుకు లెబనాన్‌తో ప్రత్యక్ష చర్చలు ప్రారంభించాలని తన మంత్రివర్గాన్ని ఆదేశించినట్టు ఇజ్రాయిల్**మిగతా 2లో...**



## బీఆర్ఎస్‌లోకి జీవన్‌రెడ్డి

కేసీఆర్‌కు, జీవన్‌రెడ్డికి 40ఏండ్లకుపైగా స్నేహం : కేటీఆర్

కేసీఆర్‌తో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది : జీవన్‌రెడ్డి

జగిత్యాలలో జీవన్‌రెడ్డితో కేటీఆర్ భేటీ

13 లేదా 27న కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకునే అవకాశం





ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

**మొదటిపేజీ తరువాయి**

మొత్తం 296 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కేరళ, పుదుచ్చేరిలలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగియగా.. అస్సాంలో ఐదు గంటలకే పూర్తయ్యింది. మూడు ప్రాంతాల్లోనూ ఈసారి భారీ సంఖ్యలో ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలోని 140 నియోజకవర్గాల్లో 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ బూత్‌లకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5గంటల వరకు 75శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కోయ్‌కోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 74.06శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి స్వల్పంగా పెరిగింది. అస్సాంలో 126 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 2.5 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సాయంత్రం 5గంటల వరకు 84శాతానికిపైగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి మరింత పెరిగింది. దల్‌గావ్‌లో అత్యధికంగా 94.57శాతం పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలోనూ భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ మొత్తం 30 అసెంబ్లీ స్థానాలుండగా.. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. ఐదు గంటల వరకే 86శాతం పోలింగ్ నమోదు కాగా.. ఇది మరింత పెరగనుంది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ.. అప్పటికే పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైన్‌లలో ఉన్నవారికి టోకెన్లు ఇచ్చి పోలింగ్‌కు అనుమతించినట్లు సమాచారం. ఈ ఏడాది మార్చి రెండో వారంలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని అసెంబ్లీలకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించింది. అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23వ తేదీన ఒక దశలో ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొంది. మే 4వ తేదీన ఈ ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడతామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# 60 ఏండ్లలో మీరు కట్టింది 25 రిజర్వాయర్లే..

**మేము 9 ఏండ్లలో 65 టీఎంసీలకు రిజర్వాయర్లు నిర్మించాం**

**పాలమూరు-రంగారెడ్డి మేజర్ పనులన్నీ మేమే పూర్తి చేశాం..**

**మిగిలిన పనులు చేయడం చేతకాలే..**

**కమీషన్ల కోసం ప్రాజెక్టులు కడతారా..: ఏదుల బహిరంగ సభలో ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ వ్యతిరేక రైతుల దీక్ష విరమణ**



**వనపర్తిఏప్రిల్ 9 (జర్నలిస్ట్ వార్త):**
"రాజకీయాల కోసం ఏనాడూ రైతులు దీక్షలు చేయలేదు.. కేవలం తమకు న్యాయం జరగాలన్న కాంక్షతోనే దీక్షలకు పూనుకుంటారు.. మీ కమీషన్ల కోసం గొల్లపల్లి- చీర్కపల్లి ప్రాజెక్టు కట్టడం సరికాదు.. 60ఏండ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టింది కేవలం 25 రిజర్వాయర్‌లే.. తొమ్మిది ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో మేము 65 టీఎంసీల రిజర్వాయర్‌లు నిర్మించాం. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ మేజర్ పార్ట్ మేమే పూర్తి చేశాం.. మిగిలిన చిన్న చిన్న పనులు పూర్తి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదు.." అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. వనపర్తి జల్లా ఏదుల మండలం గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి వారితో దీక్ష విరమింపజేశారు.

అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఒకరు జిల్లాను దత్తత తీసుకున్నానని చెబితే.. మరొకాయన వలసల జిల్లాను చేశారని విమర్శించారు. అన్ని నీళ్లు పాలమూరు-రంగారెడ్డి రిజర్వాయర్‌లో ఉంటే పాలమూరు ఎట్లా ఉండేదో ఆలోచించుకోవాలన్నారు. అనేక కేసులు వేసి ప్రాజెక్ట్ పనులకు అడ్డుకట్ట వేశారని ఆరోపించారు. రాష్ట్రాన్ని పాలిస్తున్నది నల్లమల పులి కాదని.. అది పిల్లి.. అని ఎద్దేవా చేశారు. కేఎల్ఐలో వనపర్తి నియోజకవర్గం లేదని.. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఒప్పించి వనపర్తికి నీళ్లు ఇప్పించారన్నారు. గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ అవసరం లేదని, ఏదుల నుంచి నీళ్లు పారుతాయని ఆనాడే తేల్చి చెప్పామన్నారు. మీ కమీషన్ల కక్కుర్తి కోసం ఈ ప్రాజెక్టు నిర్మాణం చేయొద్దని కోరారు. మీ భూములు కాపాడుతామని రైతులకు భరోసానిచ్చారు.

ఇక్కడ ప్రాజెక్టు కట్టకుండా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొస్తామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను జూరాల దగ్గర కట్టాల్సిందని అంటున్నారని, బుద్ధి వున్న ఎవరైనా అది సరైంది అంటారా? అని ప్రశ్నించారు. వలసలు వాపస్ అని బీఆర్ఎస్ హయాంలో వార్తలు వచ్చాయన్నారు. పాలమూరు పచ్చని రంగు వేసుకున్నదని పేపర్లో హెడ్డింగ్‌లు వచ్చాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రెండున్నర ఏండ్లలో పదివేల ఎకరాలకు నీళ్లు ఇచ్చినవా అని ప్రశ్నించారు. కానీ తెలంగాణ ఆరు గ్యారంటీలు అమలు చేశామని కేరళంకు వెళ్లి అబద్ధాలు చెప్పారని విమర్శించారు. ఇక్కడ ఏం చేయలేదుగానీ.. కేరళం వెళ్లి అన్నీ చేసేసాం అని చెప్పడమే గొప్పనా అని నిలదీశారు. ఈ సభలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, టిఆర్ఎస్ జిల్లా, ఏదుల రేవల్లి మండలాల నాయకులు పాల్గొన్నారు.

# జీవన్‌రెడ్డికి బీఆర్ఎస్ సాదర ఆహ్వానం



**జగిత్యాల ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**
తెలంగాణ రాజకీయాల్లో మరో కీలకపరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని బీఆర్ఎస్‌లోకి సాదర స్వాగతం పలుకుతున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డితో గురువారం జగిత్యాలలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. నాయకులు ఎల్.రమణ, కె.విద్యాసాగర్‌రావు, కొప్పుల ఈశ్వర్, కె.సంజయ్ కుమార్, పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి వెళ్లిన కేటీఆర్ జీవన్‌రెడ్డిని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి పార్టీలోకి ఆహ్వానించారు.

**జిల్లాలో ఘన స్వాగతం.. భారీ బైక్ ర్యాలీ**

కేటీఆర్ జగిత్యాల రాకను పురస్కరించుకుని బీఆర్ఎస్ నియోజకవర్గ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశాయి. జగిత్యాల శివారులో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి వందలాది బైకులతో భారీ ర్యాలీగా జీవన్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఇప్పటికే కేటీఆర్ ఆయనతో ఫోన్‌లో చర్చలు జరపగా, ప్రత్యక్షంగా భేటీ అయ్యి పార్టీలోకి అధికారికంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్, జీవన్‌రెడ్డి మధ్య 40ఏండ్లకు పైగా స్నేహం ఉందన్నారు. 2014కు ముందు కూడా పార్టీలోకి ఆహ్వానించామని, ఇప్పుడు మరోసారి ఆహ్వానించామని తెలిపారు. రెండ్రోజుల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలుస్తానని జీవన్‌రెడ్డి చెప్పారని అన్నారు.

**27నెలలు క్షోభ : మాజీ మంత్రి జీవన్‌రెడ్డి**

27నెలలుగా చాలా క్షోభ అనుభవించానని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. తాను బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఇప్పుడు కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చిందని, బీఆర్ఎస్‌తో పనిచేస్తే రాష్ట్ర భవిష్యత్‌కు పాటుపడొచ్చని అన్నారు. బీఆర్ఎస్ కంటే మెరుగైన పాలన కోసం కాంగ్రెస్‌కు ఓటేశారని, కానీ రాష్ట్రంలో అభివృద్ధి తిరోగమనంలో ఉందన్నారు. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో జీవన్‌రెడ్డి నివాసం వద్ద భారీగా పోలీసులు మోహరించగా, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఏప్రిల్ 13 లేదా 27 న కేసీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం.

# జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

## ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం

## డిప్యూటి సిఎం భట్టి వెల్లడి

**ఖమ్మం,ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):** కేసీఆర్ హయాంలోని పదేళ్లు వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెంలో అమ్మ పౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు.

అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు. రూ.36 కోట్లతో కట్టలేరు కాలువల మరమ్మతులను చేపట్టామని అన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలో ఉన్న భూములను రెండవ జోన్ కిందకు తీసుకువచ్చి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందజేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికొదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీతారామకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకువస్తున్నామని.. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందన్నారు. మధిర నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కట్టలేరు ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

# గోదావరి పుష్కరాల్లో విస్తృత సదుపాయాలు

## పుష్కరాల ఏర్పాట్లపై సి.ఎస్ సమీక్ష

**హైదాబాద్,ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**
రానున్న గోదావరి నదీ పుష్కరాలకు హాజరయ్యే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో సమావేశం జరిగింది. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, నిజామాబాద్ కందకుర్తి నుండి బాసర, భద్రాచలం వరకు 8 జిల్లాల్లో గోదావరి నదీ పరివాహక ప్రాంతం ఉందని, ఈ జిల్లాల్లో పుష్కర స్నానాలకై పెద్ద సంఖ్యలో ప్రజానీకం వచ్చే అవకాశం ఉన్నందున పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ పుష్కర ఏర్పాట్లపై ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రిగారు తగు సూచనలు చేశారని, వారి ఆదేశాలకు అనుగుణంగా పుష్కర ఏర్పాట్లపై తగు ప్రతిపాదనలను రూపొందించి, గోదావరి పుష్కరాలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీకి సమర్పించాలని సూచించారు. పుష్కర ఏర్పాట్లపై చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే నియమించిన ఈ.ఎన్.సి.లు, చీఫ్ ఇంజనీర్ల కమిటీ ప్రతిపాదిత పుష్కర పనులను పరిశీలించాలని సూచించారు.

# సెల్ఫీ పిచ్చి ముగ్గురు యువతుల ప్రాణాలు తీసింది

## జలపాతం వద్ద సెల్ఫీ దిగుతూ ముగ్గురు మృత్యువాత

**అల్లూరి, ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):** సరదాగా ఫోటోలు, సెల్ఫీలు తీసుకోవాలని యువత పడుతున్న ఆరాటం వారి ప్రాణాల మీదకు తెస్తోంది. సెల్ఫీ మాయలో పడి తమ వైపు పొంచి ఉన్న ముప్పును తెలుసుకోలేక అనేక మంది యువత ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు ఎన్నో. అల్లూరి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. అనంతగిరి మండలం మూలగుమ్మిలో సెల్ఫీ దిగుతూ నలుగురు బాలికలు జలపాతంలో పడిపోయారు. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో బాలిక అంజలి పరిస్థితి విషమంగా ఉంది. బాలికను అనంతగిరి మండలం లుంగపర్తి ఆసుపత్రికి తరలించారు. మృతులు త్రిష (17), రత్నకుమారి (16), పవిత్ర (16)ను హుకుంపేట మండలం జుంబువలస వాసులుగా స్థానికులు గుర్తించారు. ఇటీవలే వీరంతా ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. సెల్ఫీ పిచ్చి వీరిని ప్రమాదంలోకి నెట్టేసింది. తాజాగా అల్లూరి జిల్లాలోనూ ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. సెల్ఫీ సరదా ముగ్గురు యువతుల ప్రాణాలను బలిగొంది. అనంతగిరి మండలం వాలాసి పంచాయతీ మల్లంగుమి గ్రామ సమీపంలో ఉన్న జలపాతం వద్ద నలుగురు యువతులు సరదాగా సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఇంతలోనే ప్రమాదవశాత్తు జలపాతంలో పడిపోయారు. వారిలో ముగ్గురు అమ్మాయిలు మృతి చెందగా... మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ముగ్గురమ్మాయిలు జలపాతం సమీపంలో నిలిచి ఉండగా.. మరొక అమ్మాయి సెల్ఫీ తీస్తుండగా ప్రమాదం జరిగింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు నలుగురు అమ్మాయిలను రక్షించేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే ముగ్గురు యువతులు మరణించారు. ఓ యువతిని రక్షించి ఆస్పత్రికి తరలించగా.. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులు బూర్జ పంచాయతీ జంబు వలస గ్రామానికి చెందిన త్రిష, పవిత్ర, రత్నకుమారిగా గుర్తించారు. అంజలి అనే మరో యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. యువతుల మృతితో జంబు వలస గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రాజకీయ ఫ్లెక్సీలపై ఏపీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం..

## ఎవరిని ధ్వంసం చేస్తారని ప్రశ్న

**అమరావతిఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ఫ్లెక్సీలు, సోషల్ మీడియాలో ఆక్షేపణీయ పోస్టుల సంస్కృతిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఎవరిని ధ్వంసం చేస్తారు? 2029లో ధ్వంసం చేయాలని ఎదురు చూస్తున్నారా? రాష్ట్రాన్నా లేక ప్రజలనా?" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటివి పునరావృతం అవుతున్నాయని మండిపడింది.

వైసీపీ మాజీ సోషల్ మీడియా వింగ్ కోఆర్డినేటర్ సజ్జల భార్గవ్ రెడ్డిపై జారీ అయిన లుక్ అవుట్ సర్క్యులర్‌ను (ఎల్‌ఓసీ) రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆక్షేపణీయ పోస్టులు పెట్టేవారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయని కోర్టు అభిప్రాయపడింది. ఒకసారి అరెస్ట్ చేసినా మళ్లీ అలాంటి పోస్టులే పెడుతున్నారని, గతంలో న్యాయమూర్తులను లక్ష్యంగా చేసుకున్న వారిపై కఠినంగా వ్యవహరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని గుర్తుచేసింది. 2024 ఎన్నికల తర్వాత కూడా ఇంకా ఇలాంటివి కొనసాగిస్తున్నారా అని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. "ముఖ్యమంత్రిని అవమానించడం అంటే 5 కోట్ల మంది ఆంధ్రులను అవమానించడమే. ఎవరి కుటుంబాన్ని అయినా అవమానించే హక్కు ఎవరికీ లేదు" అని హైకోర్టు స్పష్టం చేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, సజ్జల భార్గవ్ రెడ్డి పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది.

# డిజిటల్ పేమెంట్స్: గంట సేపు ఆగాల్సిందే...

## మోసాల కట్టడికి ఆర్బీఐ ప్రతిపాదన

**ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**
దేశంలో పెరుగుతున్న డిజిటల్ చెల్లింపుల మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కీలక ప్రతిపాదనలు చేసింది. రూ.10,000కు పైబడిన ఆన్‌లైన్ లావాదేవీలను ఒక గంట పాటు హోల్డ్ లో ఉంచే (నిలిపివేత) విధానాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ మేరకు గురువారం ఒక చర్చా పత్రాన్ని విడుదల చేసి, ప్రజల నుంచి అభిప్రాయాలను కోరింది.

ఈ ప్రతిపాదన ప్రకారం, ఒక ఖాతా నుంచి మరో ఖాతాకు రూ.10,000 కంటే ఎక్కువ మొత్తంలో డబ్బు పంపితే, ఆ లావాదేవీ వెంటనే పూర్తికాదు. బదులుగా, పంపిన వారి వద్ద గంట పాటు నిలిచిపోతుంది. ఈ సమయంలో, డబ్బు పంపిన వ్యక్తికి తన లావాదేవీని రద్దు చేసుకునే అవకాశం ఉంటుంది. లావాదేవీ అనుమానాస్పదంగా అనిపిస్తే, బ్యాంకు మరోసారి నిర్ధారణ కోరుతుంది. వ్యాపార చెల్లింపులు, ఈ-మాండేట్లు, నాచ్ లావాదేవీలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు.

2025 నాటికి దేశంలో డిజిటల్ మోసాల విలువ రూ.22,930 కోట్లకు చేరడంతో ఆర్బీఐ ఈ చర్యలకు ఉపక్రమించింది. మొత్తం మోసాల విలువలో సుమారు 98.5 శాతం.. రూ.10,000కు పైబడిన లావాదేవీల ద్వారానే జరుగుతున్నాయని ఆర్బీఐ నివేదిక స్పష్టం చేసింది. సోషల్ ఇంజినీరింగ్ ద్వారా బాధితులపై ఒత్తిడి తెచ్చి మోసగాళ్లు డబ్బు బదిలీ చేయిస్తున్నారని, ఈ గంట సమయం ఆలస్యం వల్ల బాధితులకు ఆలోచించుకునే అవకాశం దొరుకుతుందని ఆర్బీఐ పేర్కొంది.

ఇదే చర్చా పత్రంలో ఆర్బీఐ మరికొన్ని ప్రతిపాదనలను కూడా చేర్చింది. 70 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు రూ.50,000కు మించి చేసే లావాదేవీలకు వారు నామినేట్ చేసిన 'విశ్వసనీయ వ్యక్తి' ఆమోదం తప్పనిసరి చేయాలని సూచించింది. ఖాతాల్లోకి వచ్చే పెద్ద మొత్తాల జమలపై సమీక్ష, అలాగే అన్ని డిజిటల్ చెల్లింపులను ఒకేసారి నిలిపివేసే 'కిల్ స్విచ్' వంటివి ఇతర ప్రతిపాదనల్లో ఉన్నాయి. ఈ ప్రతిపాదనలపై మే 8వ తేదీలోగా అభిప్రాయాలు తెలియజేయాలని వాటాదారులను ఆర్బీఐ కోరింది. వచ్చిన స్పందనల ఆధారంగా మార్గదర్శకాలను జారీ చేయనుంది.

# రాజీకొస్తారా..!

**మొదటిపేజీ తరువాయి**

ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు తెలిపారు.

"ఇజ్రాయిల్‌తో ప్రత్యక్ష చర్చలు జరపాలని లెబనాన్ పదేపదే అభ్యర్థనలు చేస్తుంది. దీంతో వీలైనంత త్వరగా లెబనాన్‌తో ప్రత్యక్ష చర్చలు ప్రారంభించాలని నేను నిన్న క్యాబినెట్‌ను ఆదేశించాను" అని ఆయన కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ 'అమెరికా కాల్పుల విరమణ లేదా ఇజ్రాయిల్ ద్వారా యుద్ధాన్ని కొనసాగించడమా అనేది తేల్చుకోవాలి' అని అన్నారు. రెండూ సాధ్యం కాదు, లెబనాన్‌పై ఇజ్రాయిల్ మారణకాండను ప్రపంచం చూస్తుందని అరాగ్చీ సోషల్ మీడియా ఎక్స్‌లో గురువారం తెలిపారు. అలాగే ఈ దాడులు కొనసాగితే ఒప్పందం బలహీనపడి, ఉద్రిక్తతలు మరింత పెరిగే ప్రమాదముందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ హెచ్చరించారు. అయితే ఇజ్రాయిల్ బరితెగింపు తీవ్ర ప్రభావం చూపుతుందని అంతర్జాతీయంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# కాళేశ్వరం మరమ్మతులు వెంటనే చేపట్టండి

**మొదటిపేజీ తరువాయి**

శాఖ, సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టేషన్లతో టీమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పనిలో సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) సభ్యులు ఉండేలా చూడాలన్నారు. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కిలోమీటర్ల బ్యారేజీని అధ్యయనం చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మేడిగడ్డ దగ్గర 500 బోరు బావులు తవ్వాల్సి ఉందనీ, ఇందుకోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఇందుకు కావాల్సిన యంత్రాలను సమకూర్చుకుని వీలైనంత త్వరగా పని పూర్తి చేయాలన్నారు. డిసెంబరు వరకు చేయాల్సిన పనులపై పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగడానికి వీలు లేదన్న ముఖ్యమంత్రి నిధుల విషయంలో ఇబ్బంది కల్గనివ్వమని స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు ప్రారంభం అయ్యాక తాను స్వయంగా వచ్చి పరిశీలిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటి పారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, సీఎం కార్యదర్శి మానిక్ రాజ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శుక్రవారం 10 ఏప్రిల్ 2026

# ఎయిడ్స్ సోకకుండా జాగ్రత్తలు తీసుకోండి

### చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ ప్రారంభించిన డాక్టర్ స్రవంతి





**షాద్ నగర్,(ప్రజావినికిడి)**
రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమము హెల్త్ వీక్ లో భాగంగా,హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి యొక్క అవగాహన ర్యాలీ డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ ర్యాలీని హెల్త్ ఎడ్యుకేటర్ జే. శ్రీనివాసులు ఎయిడ్స్ వ్యాధి యొక్క స్లోగన్స్ చెబుతూ ర్యాలీని ముందుకు తీసుకెళ్లారు.ర్యాలీ అనంతరము డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ (ఎయిడ్స్) అంటే అక్వైర్డ్ ఇమ్యునో డిఫిసియన్సీ సిండ్రోమ్ అని,ఇది (హెచ్.ఐ.వి) వైరస్ వలన వస్తుంది అని,ఇది ఒక వైరస్ వ్యాధి అని,ఈ వ్యాధి సోకిన వారిలో రోగ నిరోధక శక్తి తగ్గిపోతుందని డాక్టర్ స్రవంతి చెప్పారు.ఈ వ్యాధి యొక్క లక్షణాలు.కారణం లేకుండా బరువు తగ్గడం,తరచుగా జ్వరం రావడం,చెమటలు రావడం,సోషరశ గ్రంధులు వాచి ఉండటం, తరచూగా విరేచనాలు రావడం,శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం,శరీరం పై తెల్లని పూత వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు.వ్యాధి రాక ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు. సురక్షితమైన సెక్స్ పద్ధతులు అనుసరించడం,రక్త మార్పిడి చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం, సూదులు,సిరంజులు పంచుకోకపోవడం, వ్యక్తిగత వస్తువులు పంచుకోకపోవడం,హెచ్ఐవి పరీక్ష చేయించుకోవడం వట్టి జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్రవంతి తెలిపారు. తదుపరి హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ హెచ్.ఐ.వి అనగా (హ్యూమన్ ఇమ్యునో డెఫిషియన్సీ వైరస్) వైరస్ వలన సంక్రమిస్తుంది అని,ఈ వ్యాధి వ్యాప్తి చెందడానికి గల కారణాలు. 1)హెచ్.ఐ.వి సోకిన వ్యక్తితో అసురక్షిత సెక్స్ సంబంధాలు కలిగి ఉండడం వలన,2).హెచ్.ఐ.వి సోకిన రక్తాన్ని మార్పిడి చేయడం వలన, 3).హెచ్.ఐ.వి సోకిన వ్యక్తి ఉపయోగించిన సూదులు,చిరంజీవిలు వాడటం వలన, 4).హెచ్.ఐ.వి సోకిన తల్లి నుండి గర్భంలో ఉన్న బిడ్డకు సంక్రమించవచ్చు అని,5).ఒకరి కంటే ఎక్కువ మందితో సెక్స్ సంబంధాలు కలిగి ఉండడం వలన ఈ వ్యాధి వ్యాపిస్తుందని హెల్త్ ఎడ్యుకేటెర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి,జే శ్రీనివాసులు హెల్త్ ఎడ్యుకేటర్,హెల్తు సూపర్వైజర్లు శ్రీరామ,చంద్రకళ, స్టాఫ్ నర్స్ సువర్ణ,ల్యాబ్ టెక్నీషియన్ అశోక్,డీఈవో విజయ, ఏఎన్ఎంలు,ఆశాలు,కాంటిజెంట్ వర్కర్ శ్రీనివాస్ , మన్నెమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే పోలీస్ సేవలు

### : "ఆన్ సైట్ ఎఫ్ఐఆర్" విధానం అమలు
### షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ




**షాద్ నగర్,(ప్రజా వినికిడి);**రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండన్నగూడ గ్రామంలో ఓ మహిళ మెడలో నుండి గొలుసు దొంగతనం జరిగింది. బాధితురాలు వీరమ్మ తెలిపిన వివరాల ప్రకారం, ఈరోజు గురువారం మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో ఆమె తన పొలం వద్ద కూర్చుని ఉండగా, గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చాడు.బైక్‌ను కొంత దూరంలో ఆపి,వెనుక నుండి వచ్చి ఒక్కసారిగా ఆమె మెడలో ఉన్న సుమారు 4 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పరారయ్యాడు.సమాచారం అందిన వెంటనే షాద్‌నగర్ ఏసీపీ పి. లక్ష్మినారాయణ,సీఐ సీతారాం,ఎస్సై శివారెడ్డి లు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అక్కడికక్కడే "ఆన్ సైట్ ఎఫ్ ఐ ఆర్" నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో ప్రజల భద్రత కోసం ఇలాంటి మరిన్ని ఆధునిక పద్ధతులను అమలు చేస్తామని పోలీస్ అధికారులు తెలిపారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
హస్తినాపురం డివిజన్ పరిధిలోని హస్తినాపురం సౌత్ నందు శ్రీ పద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామి వారి 14వ బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడుతూ,శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజల పై ఉండాలని ఈ సందర్భంగా కోరుకున్నారు.

# నాచురల్ పైప్ లైన్ వ్యవస్థపై సరపరపై రెవెన్యూ కలెక్టర్ చంద్రారెడ్డి అధికారులతో సమావేశం..





**రంగారెడ్డి, (ప్రజావినికిడి):**
ఎల్ పిజి గ్యాస్ కు ప్రత్యామ్నాయంగా పైప్ లైన్ నాచురల్ గ్యాస్ ను వ్యవస్థీకరించడానికి అన్ని శాఖలు సహకరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ)చంద్రా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి అధ్యక్షతన పైప్ లైన్ నాచురల్ గ్యాస్ ను వ్యవస్థీకరించడం పై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వంట గ్యాస్ వినియోగములో ఎల్ పిజి గ్యాస్ కు ప్రత్యామ్నాయంగా వినియోగించే పైప్ లైన్ గ్యాస్ వినియోగానికి రోడ్,నేషనల్ హైవే ఇతర ప్రాంతాలలో నిర్మాణ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. పైప్ లైన్ గ్యాస్ వినియోగానికి ప్రజలు ఆసక్తి చూపేలా ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలని, నిర్మాణపరంగా వచ్చే ఆటంకాలను పరిష్కరించే విధంగా అన్నీ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాలో పైప్ లైన్ గ్యాస్ వినియోగం త్వరగా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్,సివిల్ సప్లయ్ అధికారి వనజాత, సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఒంటరిగా ఉన్న మహిళ మెడలోని గొలుసు చోరీ చేసిన దొంగ

### ప్రజల వద్దకే పోలీస్ సేవలు: "ఆన్ సైట్ ఎఫ్ఐఆర్" విధానం అమలు
### షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ



**షాద్ నగర్,(ప్రజా వినికిడి);**రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండన్నగూడ గ్రామంలో ఓ మహిళ మెడలో నుండి గొలుసు దొంగతనం జరిగింది. బాధితురాలు వీరమ్మ తెలిపిన వివరాల ప్రకారం, గురువారం రోజు గురువారం మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో ఆమె తన పొలం వద్ద కూర్చుని ఉండగా, గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చాడు.బైక్‌ను కొంత దూరంలో ఆపి,వెనుక నుండి వచ్చి ఒక్కసారిగా ఆమె మెడలో ఉన్న సుమారు 4 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పరారయ్యాడు.సమాచారం అందిన వెంటనే షాద్‌నగర్ ఏసీపీ పి. లక్ష్మినారాయణ,సీఐ సీతారాం,ఎస్సై శివారెడ్డి లు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అక్కడికక్కడే "ఆన్ సైట్ ఎఫ్ ఐ ఆర్" నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో ప్రజల భద్రత కోసం ఇలాంటి మరిన్ని ఆధునిక పద్ధతులను అమలు చేస్తామని పోలీస్ అధికారులు తెలిపారు.

# ఎమ్మెల్యే పల్లాను బురిడీ కొ ట్టించిన సైబర్ నేరగాడు

### కేంద్ర పథకం చెప్పి లక్ష రూపాయలు లూటీ -పోలీసులను ఆశ్రయించిన జనగామ ఎమ్మెల్యే






**జనగామ,ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**
ఇప్పటి వరకు అనేకమందిని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు తాజాగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైబర్ నేరస్థుడి చేతిలో మోసపోయారు. ఆయన నుంచి ఓ సైబర్ నేరస్థుడు రూ.లక్ష కొట్టేశాడు. ఈనెల 5న హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డికి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి.. తాను ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీ అంటూ పరిచయం చేసుకున్నాడు. ఓ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యేకు చెప్పాడు. దీనికిగాను ఒక్కొక్కరికి రూ.2500 చెల్లించాలని నమ్మబలికాడు. దీంతో తన నియోజకవర్గంలోని
యువతకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో సదరు అపరిచిత వ్యక్తికి ఎమ్మెల్యే పల్లా.. రూ.లక్ష ఫోన్ పే చేశారు. ఆ తర్వాత ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీకి ఫోన్ చేసి డబ్బులు వచ్చాయా? అని అడిగారు. డబ్బులు రాలేదని ఆయన సమాధానం చెప్పడంతోపాటు అసలు తాను ఫోన్ చేయలేదని తెలిపారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఎమ్మెల్యే పల్లా.. జూబ్లీహిల్స్ పీఎస్ సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు.
ఈ రకంగా బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సైబర్ నేరగాళ్ల బారిన పడటం ఇప్పుడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. స్వయంగా ఒక ప్రజాప్రతినిధిని, అది కూడా ప్రభుత్వ ఉన్నతాధికారి పేరుతో సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. సైబర్ కేటుగాళ్లు ఇప్పుడు కేవలం సామాన్యులనే కాకుండా, అత్యున్నత పదవుల్లో ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ఎమ్మెల్యే వంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారే మోసపోయారంటే, సామాన్యులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటన ద్వారా అర్థం చేసుకోవచ్చు. సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవడమే దీనికి ఏకైక పరిష్కారమని పలువురు చెబుతున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, తనను తాను తెలంగాణ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రటరీ అనంతరామిరెడ్డిగా పరిచయం చేసుకున్నాడు. ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పదవిలో ఉన్న వ్యక్తిగా నమ్మించడంతో ఎమ్మెల్యే సదరు వ్యక్తి మాటలను విశ్వసించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'వికసిత్ భారత్' పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామని నిందితుడు నమ్మించాడు. నియోజకవర్గంలో 40 మంది అర్హులైన లబ్దిదారుల జాబితాను పంపాలని, దరఖాస్తుకు ఈరోజే చివరి రోజని ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచాడు. ఒక్కో దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.2,500ల చొప్పున, మొత్తం 40 మందికి కలిపి రూ. లక్ష తక్షణమే ఫోన్ పే చేయాలని కోరాడు. ప్రజలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గంట వ్యవధిలోనే ఆ లక్ష రూపాయలను నిందితుడు చెప్పిన నంబర్‌కు బదిలీ చేశారు.డబ్బులు పంపిన తర్వాత సదరు వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అది నకిలీ కాల్ అని తెలియడంతో ఎమ్మెల్యే జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. సైబర్ నిందితులపై ఈ క్రింది సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఉన్నతాధికారుల పేర్లతో ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు, వెంటనే నగదు బదిలీ చేయకుండా సంబంధిత శాఖల ద్వారా క్రాస్ చెక్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. ఏ ప్రభుత్వ పథకానికి కూడా వ్యక్తిగత ఫోన్ పే నంబర్లకు డబ్బులు పంపాలని అధికారులు కోరారని అన్నారు. చెల్లింపులు ఎప్పుడూ అధికారిక పోర్టల్స్ లేదా చలాన్ల ద్వారానే జరుగుతాయని తెలిపారు. ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# తిమ్మాపూర్ ఐఓసిఎల్ సంస్థ ప్రాంగణంలో అవగాహన సదస్సు

## అత్యవసర రక్షణ చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహణ, కొత్తూరు సిఐ నర్సయ్య






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం తిమ్మాపూర్‌లోని (ఐఓసిఎల్ ) సంస్థ ప్రాంగణంలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే విధానాలపై అవగాహన కల్పించేందుకు 'మాక్ డ్రిల్' కార్యక్రమం నిర్వహించారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని కొత్తూరు పోలీస్ స్టేషన్ సి ఐ నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అగ్నిమాపక శాఖ అధికారులు, ఐఓసిఎల్ భద్రతా సిబ్బంది,(నాట్కో) సంస్థ సెక్యూరిటీ సిబ్బంది, వైద్య సిబ్బంది అలాగే ఉద్యోగులు కలిపి సుమారు 150 నుంచి 180 మంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొత్తూరు ఎస్‌హెచ్ఓ నర్సయ్య మాట్లాడుతూ, ఏదైనా ప్రమాదం లేదా అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు భయపడకుండా వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.ప్రాణనష్టం జరగకుండా తక్షణమే ఎలా స్పందించాలి,సురక్షిత ప్రాంతాలకు ఎలా చేరుకోవాలి అనే అంశాలపై సిబ్బందికి ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు.ప్రజల మరియు సంస్థల భద్రతే లక్ష్యంగా ఇటువంటి ముందస్తు జాగ్రత్త చర్యలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# నల్లగొండలో నకిలీ నోట్ల వ్యాపారం

### మాటువేసి దుండుగుడి పట్టివేత

**నల్లగొండఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**
కష్టపడకుండానే, ఏ పని చేయకుండానే సంపాదించాలనే ధోరణితో కొందరు కేటుగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారు. కొందరు పెట్టుబడుల పేరుతో, ఆన్ లైన్ బెట్టింగ్ పేరుతో మోసం చేస్తుంటే.. ఈ కేటుగాడు లక్ష అసలుకు 5 లక్షల దొంగనోట్లు ఇస్తానని చెప్పి సామాన్యులను మోసం చేస్తున్నాడు. నల్లగొండ జిల్లాలో నకిలీ నోట్లతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నకిలీ కరెన్సీ తో మోసం చేసిన నిందితుడిని తిప్పర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. అమాయకులను టార్గెట్ చేసి నకిలీ 500 నోట్లతో మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా పరిచయాలు పెంచుకుని నేరాలు పాల్పడుతున్నట్లు తెలిపారు. లక్ష రూపాయల అసలు కరెన్సీకి 5 లక్షల నోట్ల ఆఫర్ పేరుతో మోసం చేసినట్లు చెప్పారు. నల్ల కాగితాన్ని కెమికల్‌తో అసలు నోట్లలా చూపిస్తూ మోసాలకు పాల్పడుతున్నాడు. నోట్ల కట్టలలో పైభాగంలో ఒరిజినల్ నోట్లు లోపల నల్ల కాగితాల కట్టలతో చూపించి మోసం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మల్లేపల్లి వారిగూడేనికి చెందిన వంగూరి జానయ్య మోసానికి గురవడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. ట్రాప్ వేసి తిప్పర్తి రైల్వే స్టేషన్ వద్ద నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి బ్లాక్ కలర్ కాగిత కట్టలు, కెమికల్ బాటిల్ స్వాధీనం చేసుకున్నారు. రెడ్‌మీ మొబైల్ ఫోన్, నాలుగు అసలు 500 నోట్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సల్మాన్ ఉమా దాలియా అలియాస్ గోయిట సోంగలో అనే వెస్ట్ ఆఫ్రికా, మాలి దేశానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. రెండేళ్ల క్రితం భారత్‌కు వచ్చిన నిందితుడు బెంగళూరులో నివసిస్తూ వ్యాపారం చేస్తున్నాడు. నకిలీ కరెన్సీ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కేసు ఛేదించిన డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ వి. శంకర్, సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

# ఇంటర్ ఫలితాల ప్రకటనపై దు ష్ప్రచారాలు

## వదంతులు నమ్మవద్దన్న తెలంగాణ ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**
తెలంగాణ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని సోషల్ మీడియాలో తెగ వార్తలు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. తాజాగా, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారాన్ని తెలంగాణ విద్యాశాఖ ఖండించింది. ఈ ప్రచారం అసత్యం, అందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపింది. ఇంటర్ ఫలితాలు ప్రకటన నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే విడుదలవుతాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. గతంలో ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ మొదటి వారంలో రిలీజ్ కాలేదన్న విషయం గుర్తు చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ పెట్టింది.గతంలో ఇంటర్ ఫలితాలు విడుదలైన తేదీలు.. 2014 మే 3, 2015 – ఏప్రిల్ 22, 2016 – ఏప్రిల్ 22, 2017 – ఏప్రిల్ 16, 2018 – ఏప్రిల్ 13, 2019 –ఏప్రిల్ 18, 2020 – జూన్ 18 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2021–జూన్ 28 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2022 – జూన్ 28, 2023 – మే 9, 2024 – ఏప్రిల్ 24, 2025 –ఏప్రిల్ 22 ప్రకటించారు' అని పోస్ట్ చేశారు. ఇక జవాబు పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాలను బట్టి ఫలితాల విడుదల అయ్యే తేదీలు ప్రతి ఏటా మారుతుంటాయి. అదే విధంగా, ఈ సంవత్సరం కూడా కొనసాగుతుంది. మూల్యాంకన సమయాన్ని బట్టి, ఫలితాల విడుదల ప్రకటన చేస్తారు. ఇంటర్మీడియట్ ఫలితాల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా విద్యాశాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరుతున్నాము. సామాజిక మాధ్యమాలలో ప్రచారమయ్యే తప్పుడు వార్తలను నమ్మ వద్దని తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ పేర్కొంది.

--------------

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలి

## పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన పల్లా



**జనగామఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం జనగామ మండలంలోని పెంబర్తి, వడ్లకొండ, ఎర్ర గొల్ల పహాడ్, అడవి కేశవాపురం గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం అమ్మకాలలో సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. రైతుల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని గ్రామాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలని మిల్లర్లు ఇబ్బందులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల ధాన్యం అమ్మిన తర్వాత చెల్లింపులు ఆలస్యమైతే త్వరగా జమ చేయిస్తానని , ప్రతి కొనుగోలు కేంద్రంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ధాన్యం అమ్మకాలలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పాత బకాయిలు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రెండున్నరేళ్లుగా రైతుల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని వెల్లడించారు. మిల్లర్లు ఇబ్బందులు పెడితే కచ్చితంగా వారితో మాట్లాడి పరిష్కరి స్తానని స్పష్టం చేసారు. జనగామ నియోజకవర్గంలోని ప్రతి కొనుగోలు కేంద్రంపై ప్రత్యేక దృష్టి పెట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాధ్యతగా తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, సర్పంచులు చిన్నబోయిన రేఖ, కాయిదాపురం మహేందర్ రెడ్డి, చిర్ర సత్యనారాయణరెడ్డి, భూ రెడ్డి చైతన్య ప్రమోద్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బాల్దే సిద్ధి లింగం, నాయకులు బైరగోని యాదగిరి గౌడ్, చంద్రం గౌడ్, సీఈవో భాస్కర్ రెడ్డి, రామ్మోహన్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ చిర శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సామూహిక అత్యాచారం.. యువతి హత్య?

## ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన



**వరంగల్ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**
రాయపర్తి మండలంలో సామూహిక హత్యాచారం తీవ్ర కలకలం రేపింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై నలుగురు యువకులు హత్యాచారానికి పాల్పడ్డారు. తమ కుమార్తె(21)పై బుధవారం రాత్రి రావూరు తండాకి చెందిన నలుగురు అత్యాచారం చేశారని యువతి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆ తర్వాత అత్యంత పాశవికంగా ఆమెను చిత్రహింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆమెను ఉరి వేసి చంపేశారని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. బాధితురాలు తీవ్ర రక్త స్రావంతో మృతిచెందిందని కుటుంబసభ్యులు చెబుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వర్ధన్నపేటలో మార్చురీ ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఆర్టిజన్ సమ్మె,నల్ల బ్యాచిలతో నిరసన



**షాద్‌నగర్,(ప్రజావినికిడి),** పట్టణంలో విద్యుత్ శాఖ ఆర్టిజన్ కార్మికుల సమ్మె రెండో రోజుకు చేరుకుని ఉద్రిక్తత రేపుతోంది.డివిజన్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాచిలతో నిరసన తెలుపుతూ కార్మికులు తమ హక్కుల కోసం గళమెత్తారు.డివిజన్ జేఏసీ నాయకులు ఆంజనేయులు,కన్వీనర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు.కార్మికులు తమ ప్రధాన డిమాండ్లుగా విద్యార్హతల ఆధారంగా ఆర్టిజన్ ఉద్యోగుల కన్వర్షన్,ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు,టీజీఎన్పీడీసీఎల్, టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థల్లో అన్‌మ్యాన్డ్ వర్కర్లను ఆర్టిజన్లుగా విలీనం చేయాలని కోరుతున్నారు. అలాగే 2016కు ముందు అర్హతలతో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్,కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని,పీస్ రేట్ కార్మికులకు జీవో నంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.ఇదే కాకుండా 2026 పీఆర్సీ (వేతన సవరణ)ను తక్షణమే అమలు చేయాలని కూడా కార్మికులు స్పష్టం చేశారు.తమ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
ప్రస్తుతం ఈ ఆందోళనతో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలు మరోసారి ప్రాధాన్యతకు వచ్చాయి.ప్రభుత్వం స్పందన ఎలా ఉంటుందో అన్నది ఆసక్తికరంగా మారింది.
ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# లింగారెడ్డి గూడ పాలిటెక్నిక్ కళాశాల స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో కళాశాలల స్థాపన,పాఠశాలల అభివృద్ధి ద్వారా అక్షర వెలుగులకు ఆయువు పోసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు.ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో పాలిటెక్నిక్ కళాశాల స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఈ కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరైన నేపథ్యంలో వెంటనే పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం కూడా త్వరలోనే పూర్తవుతుందని,దీని ద్వారా విద్యా వ్యవస్థ మరింత ముందడుగు వేస్తుందని అన్నారు.కొందరు మండల కేంద్రంలోని ఏకీకృత పాఠశాల పైన కూడా దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి,గ్రామ సర్పంచ్ ఎంసీ ప్రవీణ్ కుమార్,ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్,గ్రామ పెద్దలు తందూరి అంజయ్య గౌడ్,చిలకమర్రి నరసింహులు,శీను నాయక్,చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# దూసకల్ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..

## యువనాయకుడు నయీమ్

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
దూసకల్ గ్రామంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం చేయడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నారు. దూసకల్ గ్రామంలో ప్రమాదాలు దొంగతనాలు జరుగుతున్నాయి రహదారుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే దొంగతనాలు, అనుచిత సంఘటనలు నివారించవచ్చని ప్రస్తుతం గ్రామాల్లో భద్రతా చర్యలు ఎంతో అవసరమై ఉన్న నేపథ్యంలో, సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల ప్రజలకు ఏలాంటివి ఇబ్బంది లేకుండా రాత్రి సమయంలో భద్రతగా సులభమవుతుందని తెలిపారు.దూసకల్ గ్రామ యువ నాయకుడు నయీం మాట్లాడుతూ, దూసకల్ గ్రామాన్ని ఆదర్శ తీర్చిదిద్దడానికి సీసీ కెమెరాల ఏర్పాటు తొలి అడుగు అవుతుంది.అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల సమస్యను పట్టించుకోని అధికారులతో చర్చించి త్వరలో చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాము అని మీడియాతో చెప్పుకొచ్చారు.



# దృష్టి లోపం ఉన్న వారికి ప్రత్యేక పాఠశాల




**ఖమ్మం,ఏప్రిల్ 9(ఆర్ఎన్ఎ):** ఖమ్మం జిల్లాలో దృష్టి లోపం గల విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లా ప్రజల వినతులు, ప్రజావాణిలో వచ్చిన విజ్ఞప్తుల మేరకు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక –ప్రజా పాలన లో భాగంగా ముందుకు వచ్చారు. ఖమ్మం నగర నడిబొడ్డున గల నిజాంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రత్యేక అవసరాలున్న, దృష్టిలోపం విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాలగా సర్వాంగ సుందరంగా, అత్యాధునిక వసతులతో ప్రత్యేక పాఠశాలగా తీర్చి దిద్ది, అందుబాటులోనికి తీసుకొనిరావడం జరిగినది. అంధ విద్యార్థులు సమాజంలో సమాన అవకాశాలు పొందాలి, వైకల్యం వారి చదువుకు అడ్డంకి కాకూడదు, అనే లక్ష్యంతో ఈ పాఠశాల స్థాపించబడిందని పేర్కొన్నారు.

-----

# మావిగన్ పేరుతో జోకర్‌గా మారారు

**మూడు రాజధానులంటూ రుషికొండను మింగారు**

**ఇప్పుడేమో మావిగన్ పేరుతో జోకర్‌గా మారారు**

**వైఎస్సార్ పేరు తప్ప ఆయన ఆశయాలను తుంగలో తొక్కారు**

**జగన్ తీరుపై ఘాటు విమర్శలు చేసిన వైఎస్ షర్మిల**



**అమరావతి,ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**వైఎస్సార్ తన జీవిత కాలం వ్యతిరేకించిన బీజేపీకి దత్తపుత్రుడుగా జగన్ మారారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు షర్మిల షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇదేనా వారసత్వం అంటే అని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో మూడు రాజధానుల పేరుతో రుషికొండ మింగేసి సొంతానికి ప్యాలెస్‌లు కట్టుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు 'మావిగన్ జోకర్'గా జగన్ మిగిలారని సెటైర్లు గుప్పించారు. సంక్షేమానికి సారథి దివంగత నేత వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ప్రతీ పథకం ప్రజల కష్టం, కన్నీళ్ల నుంచి పుట్టిందేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకుడు, మా నాన్న వైఎస్సార్ ప్రజాప్రస్థానం తెలుగు ప్రజల గుండెల్లో ఈరోజుకి పదిలమని షర్మిల చెప్పుకొచ్చారు. ఏప్రిల్ 9, 2003లో చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం దాక ప్రజాహితమే పరమావధిగా వైఎస్సార్ చేపట్టిన1457 కిలోమీటర్ల పాదయాత్ర సాగిందని తెలిపారు. ఈ పాదయాత్రకు 23 ఏళ్లని చెప్పారు. వారసులమని చెప్పుకునే జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ పేరును వాడుకున్నారు తప్పితే.. ఆయన ఆశయాలకు వారసులు ఎందుకు కాలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. వైసీపీలో నిజంగా వైఎస్సార్ ఐడియాలజీ ఉంటే జగన్ సీఎం అయ్యాక కూడా వైఎస్సార్ జలయజ్ఞాన్ని ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. 'మాట తప్పం మడమ తిప్పం' అనే వైఎస్సార్ లైన్ వాడుకోవడం తప్పిస్తే, పూర్తి మద్యపాన నిషేధమని మాట ఇచ్చి, కల్తీ మద్యం అమ్మి 'ఓన్లీ క్యాష్' మాఫియా ఎందుకు చేశారని షర్మిల ప్రశ్నించారు. వారసులమని చెప్పుకొనే జగన్ కేవలం వైయస్సార్ పేరును మాత్రమే వాడుకున్నారని వైఎస్ షర్మిల విమర్శించారు. వైఎస్ఆర్ ఆశయాలకు జగన్ వారసులు కాలేదని ఎద్దేవా చేశారు. వైఎస్ఆర్ భావజాలం ఉంటే జలయజ్ఞం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.

'వైఎస్ఆర్ వ్యతిరేకించిన భాజపాకి దత్తపుత్రుడిగా ఎందుకు మారారు? ఎస్సీలు, క్రైస్తవులపై దాడులు జరుగుతుంటే మౌనంగా ఎందుకున్నారు? మూడు రాజధానుల పేరుతో రుషికొండ మింగేసి ప్యాలెస్‌లు కట్టారు. ఇప్పుడు 'మావిగన్ జోకర్'గా మిగిలారు. వైయస్సార్ హయాంలో రాష్ట్రంలోనే ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే మౌనంగా ఎందుకున్నారని షర్మిల ప్రశ్నించారు.

## జీవన్ రెడ్డి విమర్శలు సరికాదు: మంత్రి

**హైదరాబాద్,ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**

ప్రజలు మార్పు కోరుకుంటున్నారని జీవన్ రెడ్డి అనడం సరికాదని తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. తాను బీఆర్ఎస్‌లోకి వెళ్తానని చెబుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై జీవన్‌రెడ్డి విమర్శలు చేశారు. ఈ క్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విలేకర్ల సమావేశంలో మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డిని ఓడించడమే ధ్యేయమని జీవన్ రెడ్డి అనడం సరికాదు. ఆయన ఎన్నికల్లో ఓడిన పది నిమిషాలకే రేవంత్ రెడ్డి ఫోన్ చేశారు. ఓడినా మంత్రి పదవి ఇస్తామని అన్నారు. ఓడినవారికి మంత్రి పదవి ఇవ్వకూడదన్న ఏఐసీసీ నిబంధన వల్లే ఇవ్వలేదు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ 14 సార్లు బీఫామ్ ఇచ్చిందని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు.

## వరి కొనుగోలు మరో 2 నెలలు పెంచాలి

**కేంద్రానికి మంత్రి ఉత్తమ్ లేఖ**

**హైదరాబాద్,ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**



వరి కొనుగోలు సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాసారు. ఈ సీజన్‌లో మరో రెండు నెలల గడవు పెంచాలని కోరారు. రబి 2024-25కు 5 లక్ష మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ టార్గెట్ పెట్టాలని..ఎఫ్‌సీఐ రా రైస్ టార్గెట్ తగ్గించాలని సూచించారు మంత్రి ఉత్తమ్. 8.45 లక్ష మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీ ఇంకా పెండింగ్ ఉందని.. ఇప్పటికే గడువు ముగిసిన క్రమంలో మరో 60 రోజులు గడువు పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఐదు శాతం బ్రోకెన్స్‌తో బాయిల్డ్ రైస్ సరఫరాకు మిల్లర్ల అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. 2025-26కు బాయిల్డ్ రైస్ టార్గెట్ 20 నుంచి 40 ఒఓ-ులకు పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన ఉత్పత్తికి సరిపడా టార్గెట్లు లేవని రాష్ట్రం ఆందోళనలో ఉందని అన్నారు. కేంద్రం టార్గెట్లు తగ్గించడంతో నిల్వలు పెరుగుతున్నాయని.. రైతులకు భరోసా కల్పించేందుకు నిరంతర కొనుగోలు అవసరం ఉందని.. అదనపు ప్యాడీతో రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు.మరో 2 నెలల గడువు పెంచాలని కోరారు.

# అంగన్‌వాడీ టీచర్‌పై అఘాయిత్యం

**చెట్టుకు కట్టేసిన కొట్టిన ఐదుగురి అరెస్ట్**

**సంగారెడ్డి,ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):** సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం రాసోల్ గ్రామంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. అంగన్‌వాడీ టీచర్ వసంత కుమారిని ఈడ్చుకెళ్లి చెట్టుకు కట్టేసి కొట్టారు గ్రామస్తులు. జుట్టు కత్తిరించి గాడిదాపై ఉరేగిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. వద్దని ప్రాధేయపడ్డా కూడా కనికరించకుండా గ్రామస్తులు దారుణంగా వ్యవహరించారు. గంటకు పైగా అంగన్ వాడీ టీచర్ ను చిత్రహింసలకు గురిచేసినట్లు తెలిపారు. దీనికి గల కారణం ఏంటంటే.. అంగన్ వాడీ టీచర్ భర్త ఇన్సూరెన్స్ డబ్బులను గ్రామస్థుల నుంచి వసూలు చేసి తిరిగి ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు. భర్తపై ఉన్న కోపంతో సంబంధం లేని మహిళపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు గ్రామస్తులు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## శంషాబాద్‌లో భారీగా డ్రగ్స్ స్వాధీనం

**హైదరాబాద్,ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ డ్రగ్స్ దందాకు అడ్డుకట్ట పడటం లేదు. ఈగల్ టీం, పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో తరచూ డ్రగ్స్ పట్టుబడుతూనే ఉన్నాయి. శంషాబాద్ ఎయిర్ పోర్టులో మరోసారి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు కస్టమ్స్ అధికారులు. గురువారం శంషాబాద్ ఎయిర్ పోర్టులో రూ. 4.6 కోట్ల విలువ చేసే 13.2 కిలోల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి థాయ్ ఎయిర్ వేస్ ఫ్లైట్ లో వచ్చిన ప్రయాణికుడి బ్యాగ్ తనిఖీ చేయగా గాంజా లభ్యమైనట్లు తెలిపారు అధికారులు. అతడి నుంచి 13.2 కిలోల హైడ్రోఫోనిక్ గాంజా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు అధికారులు.ప్రయాణికుడితో పాటు డ్రగ్స్ నెట్వర్క్ నిర్వహిస్తున్న మరో నిందితుడిని కూడా అరెస్ట్ చేసినట్లు తెలిపారు కస్టమ్స్ అధికారులు. 2025-26 సంవత్సరంలో మొత్తం 160 కిలోల హైడ్రోఫోనిక్ గంజా స్వాధీనం చేసుకొని 30 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు కస్టమ్స్ అధికారులు.

# విద్యతోనే పేదరిక నిర్మూలనం

**ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ స్థాయి విద్య: భట్టి విక్రమార్క**





**బోనకల్,/ ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**

రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బోనకల్ మండలంలో గురువారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు.మొదట ఈ పథకాన్ని బాలికలకే పరిమితం చేయాలని భావించామని, అనంతరం 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు బాలురకూ విస్తరించామని ఆయన తెలిపారు. మండలంలోని 11 పాఠశాలల్లో మొత్తం 777 మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు.విద్యార్థులు కృషి చేసి ఉన్నత స్థాయికి చేరాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. పేదరికం విద్యకు అడ్డంకి కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఇంగ్లీష్ మాధ్యమంలో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించడంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఒక్కోటి రూ.200 కోట్లతో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని వెల్లడించారు. ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నివాసాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, హాస్టళ్లు, క్రీడా మైదానాలు వంటి అన్ని సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు.రాబోయే విద్యా సంవత్సరంలో 119 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రవాణా సదుపాయాలు, యూనిఫామ్, షూస్, టై వంటి అవసరాలు అందించనున్నట్లు చెప్పారు. వారానికి మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి జావ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 20 లక్షల మంది విద్యార్థులకు జూన్ 2 నుంచి ఉదయం అల్పాహార పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని, సమానత్వ సమాజ నిర్మాణానికి విద్యే మార్గమని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, పేద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు ఉపయుక్తమని, సైకిళ్లతో విద్యార్థులు సులభంగా పాఠశాలలకు వెళ్లగలరని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాకు కట్టడి ఉండాల్సిందే

**మంత్రి నారా లోకేశ్ స్పష్టీకరణ**



**అమరావతి, ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):** మారుతున్న కాలంలో సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. దాని దుష్ప్రభావాల నుంచి భావి తరాలను కాపాడుకోవాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ బాధ్యత ప్రభుత్వంపైనా ఉందని నారా లోకేశ్ స్పష్టం చేశారు. పిల్లల డిజిటల్ భద్రత, మహిళల గౌరవంపై మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 'పిల్లల మానసిక వికాసం దెబ్బతినకుండా ఉండేందుకు సోషల్ మీడియాలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలన్నారు. 13 నుంచి 16 ఏళ్ల వయసు పిల్లలకు కేవలం వారి ఎదుగుదలకు, విద్యకు ఉపయోగపడే కంటెంట్ మాత్రమే అందుబాటులో ఉండేలా విధివిధానాలను రూపొందించాలి. సోషల్ మీడియాను వేదికగా చేసుకొని విద్వేషాలను చిమ్మేవారిని ఉపేక్షించేది లేదు. మహిళల పట్ల అవమానకరంగా ప్రవర్తించినా, అశ్లీల లేదా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసినా కఠినమైన చర్యలు తీసుకుంటాం. ఇతర రాష్ట్రాలు, అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న డిజిటల్ సేఫ్టీ చట్టాలను అధ్యయనం చేసి, ఆంధ్రప్రదేశ్‌లో అత్యుత్తమ విధానాన్ని అమలు చేయాలి. పిల్లలను సోషల్ మీడియా దుష్ప్రభావాలకు దూరం చేయడం ఇప్పుడు అనివార్యం. వారి సృజనాత్మకతను కాపాడుతూనే, సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం' అని అన్నారు.

## రాయలసీమ రిజిస్ట్రార్‌కు హైకోర్టు షాక్

**వాయిదాలకు గైర్హాజరు కావడంపై ధర్మాసనం ఆగ్రహం**

**అమరావతిఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**రాయలసీమ యూనివర్శిటీ రిజిస్ట్రార్‌కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు షాకిచ్చింది. వాయిదాలకు గైర్హాజరు కావడంపై ధర్మాసనం ఆగ్రహించింది. ఈ మేరకు బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. గతంలో యూనివర్శిటీ విధుల నుంచి తమను తొలగించడంపై ముగ్గురు కాంట్రాక్టు ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. అయితే కోర్టు ఆదేశాల అమలులో యూనివర్శిటీ రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడు నిర్లక్ష్యం వహించారు. 52 రోజులపాటు వారిని విధుల్లోకి తీసుకోలేదు. దీనిపై మరోసారి కోర్టును సదరు కాంట్రాక్టు ఉద్యోగులు ఆశ్రయించారు . తమకు 52 రోజుల జీతం కూడా ఇప్పించాలని విన్నవించారు. వాయిదాలకు రాకపోవడం, కోర్టు ఉత్తర్వులు అమలు చేయడంలో జాప్యం చేసినందున రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడుపై బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది ధర్మాసనం. ఇప్పటికే యూనివర్శిటీలో పలు అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు ఉత్తర్వులు సంచలనంగా మారాయి.


## తెలంగాణలో మండుతున్న ఎండలు

**ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్**

**హైదరాబాద్, ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):** తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే భానుడి భగభగలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరో 3 డిగ్రీలు పెరుగుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. గురువారం ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, మిగతా అన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఎండలు, వడగాలులతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో జనం బయటకు రావాలనే జంకుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. రెండు ఆవర్తన ద్రోణుల ప్రభావంతో వచ్చే వారంపాటు పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నది. బుధవారం రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది. దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలిపింది. వచ్చే మూడ్రోజులు ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే అన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో అత్యధికంగా 41.6 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో 41.5, నల్లగొండ జిల్లా నేరడుగొమ్మలో 41.5, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 41.4, జనగామ జిల్లా పాలకుర్తిలో 41.2, వరంగల్ జిల్లా సంగెంలో 41.2, హైదరాబాద్‌లో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని వెల్లడించింది. ప్రజలు బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## మక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్న సీతక్క**



**మహబూబాబాద్, ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):** :జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు గార్ల మండలం సీతంపేటలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు దోపిడీకి గురవుతున్నారని విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో కొనుగోలు కేంద్రాలపై ఫోకస్ పెట్టారు. ఈ మేరకు మంత్రి సీతక్క రంగంలోకి దిగారు. గురువారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేటలో సీతక్క పర్యటించారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడారు. వారి కోరిక మేరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మొక్కజొన్నలు ప్రైవేట్ దళారీలకు విక్రయించి మోసపోవద్దని ఈ సందర్భంగా రైతులకు మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.2,400 గిట్టుబాటు ధర కల్పించిందని తెలిపారు. మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క కోరారు. ఒక్క ఎకరాకు 25 క్వింటాలు మాత్రమే కొనుగోలు కాకుండా 50 క్వింటాలు పండించినా ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఇబ్బంది పడకుండా పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు.

# ఒక యుద్ధం..అనేక చేదు అనుభవాలు !

ట్రంప్, నెతన్యాహులు కలసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరా÷– నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు




కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహ్రెయిన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు ర్మూజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే ర్మూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణ మైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

# జనం నవ్వుకుంటున్నారు

## మావిగన్ పేరుతో మరో నాటకం -జగన్ తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత

**ఏలూరు,ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):** మావిగన్' పేరు ఎత్తితే జనం నవ్వుకుంటున్నారని హోం మంత్రి అనిత వ్యాఖ్యలు చేశారు. అమరావతిపై అక్కసుతో ఇలా చేస్తున్నారని, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హోం మంత్రి విరుచుకుపడ్డారు. 'గత వైపీపీ హయాంలో కనీసం ఒక ఫైర్ ఇంజన్ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. తప్పు చేసిన వారి విషయంలో చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామన్నారు. అవగాహన లేని వాళ్ళు గతంలో ఇష్టానుసారంగా వ్యవహరించి కోర్టుల నుంచి మొట్టికాయలు వేయించుకున్నారని తెలిపారు. విజ్ఞత కలిగిన నాయకులు మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో అలాంటి





తప్పులు చేయదలుచుకోలేదని హోం మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏదైనా చట్ట ప్రకారం చేయడమే తప్ప ఎక్కడా ఉదాసీనతగా వ్యవహరించదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థకు అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఉన్నట్లు హోంమంత్రి అనిత వెల్లడించారు. ఉదయం ఏలూరు చేరుకున్న హోం మంత్రికి ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణ, గన్ని వీరాంజనేయులు, రెడ్డి అప్పలనాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రూ.2 కోట్ల 72 లక్షలతో నిర్మించిన మహిళా పోలీస్ స్టేషన్ భవనాన్ని అనిత ప్రారంభించారు. ఆపై పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ ప్రతాప్ కిషోర్ పాల్గొన్నారు.

# తాత్కాలిక కాల్పుల విరమణ జరిగినా..

## సైనిక బలగాలు ఇరాన్ చుట్టూ కొనసాగుతాయి

## స్పష్టం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్,ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ పూర్తిగా ఒప్పందాన్ని అమలు చేసే వరకు అమెరికా సైనిక బలగాలు అక్కడే కొనసాగుతాయని తెలిపారు. ఇరాన్–అమెరికా మధ్య బుధవారం రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ తమ దేశానికి చెందిన యుద్ధ నౌకలు, విమానాలు, సైనికులు, ఆయుధాలు మొదలైనవి ఇరాన్ పరిసర ప్రాంతాల్లోనే ఉంటాయని ట్రంప్ పేర్కొన్నారు .యుద్ధం ముగింపునకు సంబంధించి పూర్తి స్థాయి ఒప్పందం అమలయ్యేంత వరకు సైనికులు వెనక్కి రారని ట్రంప్ తెలిపారు. ఒకవేళ ఒప్పందాన్ని ఇరాన్ పాటించకపోతే మునుపెన్నడూ చూడని స్థాయిలో విరుచుకుపడతామని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధి మార్గం సురక్షితంగా ఉండాలని, నౌకాయానం నిరంతరం కొనసాగాలని అన్నారు. ఒప్పందం కుదిరేవరకు అమెరికా సైన్యం అక్కడే విశ్రాంతి తీసుకుంటూ, తమ తదుపరి మిషన్ కోసం ఎదురుచూస్తుందన్నారు. మరోవైపు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు భారీగా కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం 254 మంది మరణించినట్టు వార్తలు వస్తున్నాయి. 1,100 మందికి పైగా గాయపడ్డారని సమాచారం. ముఖ్యంగా బీరుట్, దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లో నష్టం మరింత తీవ్రంగా ఉందని వార్తలు వస్తున్నాయి.

# పాకిస్థాన్‌పై మాకు నమ్మకం లేదు

## ఇజ్రాయిల్ రాయబారి రూవెన్ అజార్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):** అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు పలికిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఒప్పందంలో మధ్యవర్తిత్వ పాత్ర పోషించిన పాకిస్థాన్‌పై తమకు నమ్మకం లేదని ఆ దేశ రాయబారి పేర్కొన్నారు. భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ తాజాగా మాట్లాడుతూ.. శాంతి చర్చల్లో పాక్ పాత్రపై సందేహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం ఆ దేశాన్ని మధ్యవర్తిగా ఉపయోగించు కోవాలని నిర్ణయించుకుందని తాను భావిస్తున్నట్టు అజార్ పేర్కొన్నారు. ఏదేమైనా ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు అమెరికాతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అమెరికా–మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ మద్దతు ఇస్తోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ఇరాన్ వరకే పరిమితం అని, లెబనాన్‌పై తమ దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ రాయబారి వెల్లడించారు. ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా తొలగించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# నెతన్యాహూకు స్వదేశంలో తీవ్ర వ్యతిరేకత

## కాల్పుల విరమణ ..రాజకీయ వైఫల్యం

## ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్ విమర్శలు

**టెలిఅవీవ్,ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):** యుద్ధ లక్ష్యాలను సాధించడంలో ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు విఫలమయ్యారని ఇజ్రాయెల్ ప్రతిపక్ష నాయకులు విమర్శలు గుప్పించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్.. కాల్పుల విరమణ ఒప్పందాన్ని, ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఆక్షేపించారు. ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని రాజకీయ వైఫల్యంగా అభివర్ణించారు. యుద్ధ లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు తీవ్రంగా విఫలమయ్యారని, ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ భద్రతకు ప్రమాదకరమని యైర్ లాపిడ్ పేర్కొన్నారు. 'మన చరిత్రలో ఇంతటి రాజకీయ విపత్తు ఎన్నడూ జరగలేదు. అహంకారం, నిర్లక్ష్యం, వ్యూహాత్మక ప్రణాళిక లేకపోవడం వల్ల నెతన్యాహు కలిగించిన రాజకీయ, వ్యూహాత్మక నష్టాన్ని పూడ్చడానికి మనకు సంవత్సరాలు పడుతుంది' అని ట్వీట్ చేశారు. సైన్యం తమకు అప్పగించిన పనులన్నీ పూర్తి చేసిందని, ప్రజలు కూడా అద్భుతమైన స్థైర్యాన్ని ప్రదర్శించారని, అయితే నెతన్యాహు రాజకీయంగా, వ్యూహాత్మకంగా విఫలమయ్యారని విమర్శించారు. తాను నిర్దేశిరచుకున్న లక్ష్యాలలో దేనినీ నెతన్యాహు సాధించలేకపోయారన్నారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్మూలించడం లేదా తీవ్రంగా దెబ్బతీయడాన్ని నెతన్యాహు యుద్ధానికి ప్రధాన లక్ష్యంగా నిర్దేశిరచారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని
ఇజ్రాయెల్‌కు అస్తిత్వ ముప్పుగా అభివర్ణించారు. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యాలను నిర్వీర్యం చేయాలని, ఇరాన్ పాలనను బలహీనపరచాలని, దాని మిత్ర బృందాల నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకోవాలని నెతన్యాహు లక్ష్యాలుగా పెట్టుకున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు దారుణంగా విఫలమయ్యారని మాజీ ప్రధాని నాఫ్తాలి బెన్నెట్ విమర్శించారు. 'నాయకత్వం మనకు భ్రమలు కల్పించింది. వారి వాగ్దానాలన్నీ ఈ రాత్రి మన మొహం మీదే పేలిపోయాయి' అని బెన్నెట్ ట్వీట్ చేశారు. ఈ ఒప్పందం రాబోయే సంవత్సరాల పాటు ఇజ్రాయెల్ భద్రతను ప్రమాదంలో పడేసే ఒక సంపూర్ణ వైఫల్యం అని అభివర్ణించారు.

## ఇంటర్ ఫలితాలను ఉద్దేశపూర్వకంగా

# ఆలస్యం చేస్తున్నారా?

## : తెలంగాణ విద్యాశాఖ ఏం చెప్పిందంటే?




ఇ

ఇంటర్ ఫలితాలను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని తెలంగాణ విద్యా శాఖ ఖండించింది. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. ఫలితాల ప్రకటన నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందని తెలిపింది.ఇంతకుముందు ఎప్పుడూ ఏప్రిల్ మొదటి వారంలో ఇంటర్ ఫలితాలు విడుదల కాలేదని ఈ సందర్భంగా గుర్తు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి గత ఏడాది వరకు జరిగిన ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదలైన తేదీలను కూడా పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఫ్యాక్ట్ చెక్ 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది.ఇంటర్ ఫలితాలు 2014లో మే 3న, 2015లో ఏప్రిల్ 22న, 2016లో ఏప్రిల్ 22న, 2017న ఏప్రిల్ 16న, 2018లో ఏప్రిల్ 13న, 2019లో ఏప్రిల్ 18న, 2021లో జూన్ 28న, 2022లో జూన్ 28న, 2023లో మే 4న, 2024లో ఏప్రిల్ 24న, 2025లో ఏప్రిల్ 22న విడుదలయ్యాయని పేర్కొంది.సమాధాన పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాల ఆధారంగా ఫలితాలను ప్రకటించే తేదీలు ప్రతి సంవత్సరం మారుతుంటాయనే విషయాన్ని గ్రహించాలని పేర్కొంది. మూల్యాంకనం పూర్తయ్యే సమయం ఆధారంగానే ఫలితాలను విడుదల చేస్తారని తెలిపింది. విద్యా శాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విద్యార్థులు, తల్లిదండ్రులు విశ్వసించాలని, సామాజిక మాధ్యమాల్లో ప్రసారమయ్యే తప్పుడు వార్తలను నమ్మవద్దని కోరింది.

# మీడియాపై ఏ పార్టీ దాడి చేసినా నేను ఖండిస్తా

## : వెంకయ్యనాయుడు



**ఏప్రిల్ 9 (ప్రజావినికిడి):**
మీడియా స్వేచ్ఛ, మాతృభాష ప్రాముఖ్యతపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. చిత్తూరులోని ఎస్పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన, నూతన వసతి గృహాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.
ఇటీవల మీడియా సంస్థలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఆయన స్పందిస్తూ... వార్తల్లో అసత్యాలు ఉంటే శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఎవరికైనా ఉంటుందని, కానీ భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదని హితవు పలికారు. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే చర్యలను ఏ రాజకీయ పార్టీ చేసినా తాను తీవ్రంగా ఖండిస్తానని స్పష్టం చేశారు. మాతృభాషను మర్చిపోవడం అంటే అమ్మను మర్చిపోవడమేనని, జన్మనిచ్చిన తల్లిని, ఊరిని, దేశాన్ని ఎప్పుడూ గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. సోషల్ మీడియా ఊబిలో పడి సమయాన్ని వృథా చేయవద్దని, చదువుతో పాటు ఆటలకు, యోగాకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాజకీయ వారసత్వానికి తాను వ్యతిరేకినని, అయితే సేవా కార్యక్రమాలు కొనసాగించే కుటుంబాలను ప్రోత్సహిస్తానని వెల్లడించారు. ఆహారపు అలవాట్లను మార్చుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

# ఢిల్లీ క్యాపిటల్స్‌ను ముంచిన ఐపీఎల్ రూల్..



ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ అభిమానులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. గెలవాల్సిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ చేతిలో కేవలం 1 పరుగు తేడాతో ఢిల్లీ ఓడిపోయింది. అయితే, ఈ ఓటమికి కేవలం ఆటగాళ్ల ప్రదర్శన మాత్రమే కాదు, ఐపీఎల్‌లోని ఒక విచిత్రమైన నియమం కూడా కారణమని ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మాజీ క్రికెటర్లు సైతం ఈ నిబంధనపై మండిపడుతున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్ 10వ ఓవర్లో ఒక వింత సంఘటన జరిగింది. నితీష్ రాణా బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఎల్బీడబ్ల్యూ అప్పీల్ రావడంతో అంపైర్ అవుట్ ఇచ్చాడు. అయితే, ఆ సమయంలో రాణా ఒక పరుగు పూర్తి చేశాడు. కానీ నితీష్ రాణా రివ్యూ తీసుకోగా, బంతి గ్లోవ్స్‌కు తగిలిందని తేలింది. డీఆర్ఎస్‌లో అంపైర్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని నాటౌట్ ప్రకటించాడు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. ఐసీసీ నియమం ప్రకారం అంపైర్ అవుట్ అని వేలు ఎత్తగానే ఆ బంతి డెడ్ అయినట్లు లెక్క. దీంతో రాణా తీసిన ఆ ఒక్క పరుగును స్కోరు బోర్డులో చేర్చలేదు. ఒకవేళ ఆ రన్ ఇచ్చి ఉంటే మ్యాచ్ టై అయ్యేది లేదా ఢిల్లీ గెలిచేది. ఈ నిబంధనను మార్చాలని ఎప్పటి నుంచో మొత్తుకుంటున్నా, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ పట్టించుకోకపోవడం ఇప్పుడు ఢిల్లీకి శాపంగా మారింది. కేవలం రూల్ మాత్రమే కాదు, ఆఖరి ఓవర్లో డేవిడ్ మిల్లర్ తీసుకున్న నిర్ణయం కూడా అందరినీ విస్మయానికి గురిచేసింది. ఢిల్లీ గెలవాలంటే చివరి ఓవర్లో 13 పరుగులు కావాలి. మిల్లర్ అప్పటికే మంచి ఊపులో ఉన్నాడు. చివరి రెండు బంతులకు 2 పరుగులు అవసరమైన దశలో.. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన ఐదో బంతిని మిల్లర్ ఆడాడు. కానీ విచిత్రంగా ఆయన పరుగు తీయడానికి నిరాకరించాడు. తనే స్ట్రైకింగ్‌లో ఉండి చివరి బంతికి ఫోర్ లేదా సిక్స్ కొట్టి గెలిపించాలనే అతివిశ్వాసంతో ఆయన పరుగు తీయలేదు. కనీసం ఆ రన్ తీసుంటే స్కోరు సమమయ్యేది. చివరి బంతికి 2 పరుగులు కావాలి. మిల్లర్ కనీసం బంతిని తాకలేకపోయాడు. కనీసం బై రన్ తీసి మ్యాచ్‌ను టై చేద్దామని నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న కుల్దీప్ యాదవ్ వేగంగా పరిగెత్తాడు. కానీ వికెట్ కీపర్ జోస్ బట్లర్ అప్రమత్తంగా ఉండి కుల్దీప్‌ను రన్ అవుట్ చేశాడు. దీంతో గెలుపు ముంగిట ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్క పరుగు తేడాతో ఓటమిని చవిచూసింది. 210 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చివరి వరకు పోరాడినప్పటికీ, అదృష్టం ఢిల్లీ వైపు లేదు. ఈ మ్యాచ్ ఫలితం తర్వాత ఐపీఎల్ నిబంధనలపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. అంపైర్ తప్పుడు నిర్ణయం వల్ల ఒక పరుగు కోల్పోవడం ఏ రకమైన న్యాయమని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ప్రముఖ స్టాండప్ కమెడియన్ అభిజిత్ గంగూలీ కూడా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ట్వీట్ చేశారు.

# డేవిడ్ మిల్లర్‌కు అండగా సునీల్ గవాస్కర్

ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ బ్యాటర్ డేవిడ్ మిల్లర్‌కు భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ అండగా నిలిచారు. మ్యాచ్ గెలిపించాలనే అతని ఉద్దేశాన్ని తప్పుబట్టలేమని సన్నీ అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో బుధవారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్క పరుగు తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. ఢిల్లీ విజయానికి చివరి రెండు బంతుల్లో రెండు పరుగులు అవసరం కాగా.. ఐదో బంతిని లెగ్ సైడ్‌కు ఆడిన డేవిడ్ మిల్లర్ సింగిల్‌కు నిరాకరించాడు. దాంతో నాన్ స్ట్రైకర్ కుల్దీప్ యాదవ్ క్రీజు వరకు వచ్చి వెనక్కి వెళ్లిపోయాడు. ఆఖరి బంతిని మిల్లర్ కనెక్ట్ చేయలేకపోవడంతో సింగిల్‌కు ప్రయత్నించిన కుల్దీప్ యాదవ్ రనౌట్ అయ్యాడు. దాంతో గెలవాల్సిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్క పరుగు తేడాతో ఓటమిపాలైంది. డేవిడ్ మిల్లర్ చేసిన తప్పిదం కారణంగానే ఢిల్లీ క్యాపిటల్స్ ఓటమిపాలైందని అతనిపై ఫ్యాన్స్ మండిపడ్డారు. మిల్లర్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని కూడా ఆరోపించారు. మిల్లర్ ఆ సింగిల్ తీసి ఉంటే మ్యాచ్ డ్రా అయ్యేదని, ఆ తర్వాత కుల్దీప్ అయినా



సూపర్ ఓవర్‌కు దారి తీసేదని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఈ మ్యాచ్‌లో డేవిడ్ మిల్లర్ గాయంతోనే ఆడి 20 బంతుల్లో 41 పరుగులతో అజేయంగా నిలిచి ఢిల్లీ క్యాపిటల్స్‌ను గెలుపు అంచులకు చేర్చినప్పటికీ, చివరి అడుగులో తడబడ్డాడు. అయితే మిల్లర్‌పై వస్తున్న విమర్శలను సునీల్ గవాస్కర్ తప్పుబట్టారు. సూపర్ ఫామ్‌లో ఉన్న మిల్లర్.. మ్యాచ్‌ను తానే పూర్తి చేయగలనని నమ్మాడని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. మిల్లర్ ఉద్దేశాన్ని తప్పుబట్టలేమని పేర్కొన్నారు. అధికారిక బ్రాడ్‌కాస్టర్ జియో హాట్‌స్టార్ షోలో మాట్లాడుతూ.. మిల్లర్‌కు అండగా నిలిచారు.'డేవిడ్ మిల్లర్ తన సామర్థ్యాన్ని నమ్మాడు. అతను అద్భుతంగా బంతిని హిట్ చేశాడు. మ్యాచ్‌ను ముగించగలనని అనుకున్నాడు. అతని ఉద్దేశాన్ని మనం తప్పుపట్టలేం. సిద్ధ్ కృష్ణ సరైన ఎత్తులో అద్భుతమైన స్లో బౌన్సర్‌ను వేయడంతో బంతిని కనెక్ట్ చేయడం కష్టమైంది. ఒత్తిడిలో ఇలా జరగడం సర్వ సాధారణం.'అని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. గేమ్ అవేర్‌నెస్ ఎంత ముఖ్యమో వివరించిన గవాస్కర్.. 1986లో ఆస్ట్రేలియాతో జరిగిన టై టెస్ట్‌ను గుర్తు చేసుకున్నారు. ఆ మ్యాచ్‌లో రవిశాస్త్రి కీలక సమయంలో సింగిల్ తీసి స్కోరును సమం చేశాడని చెప్పారు. 'ఇక్కడే గేమ్ అవేర్‌నెస్ చాలా కీలకం అవుతుంది. 1986లో ఆస్ట్రేలియాతో జరిగిన ఆ టై టెస్ట్‌లో రవిశాస్త్రి సరైన సమయంలో సింగిల్ తీసి స్కోర్‌లను సమం చేసిన తీరు నాకు గుర్తుకు వస్తుంది' అని వ్యాఖ్యానించారు. ప్రస్తుత మ్యాచ్ విషయంలో.. మిల్లర్ సింగిల్ తీసి మ్యాచ్‌ను టై చేయాల్సింది. ఆ తర్వాత కుల్దీప్ యాదవ్ సింగిల్ తీసి మ్యాచ్ గెలిపించేవాడు. క్రీజులోకి రాగానే కుల్దీప్ యాదవ్ చేసింది ఇదే. క్విక్ సింగిల్ తీసి మిల్లర్‌కు స్ట్రైక్ ఇచ్చాడు. కుల్దీప్‌పై మి

# తప్పుడు బంతితో అతన్ని డకౌట్ చేశా

## గుజరాత్ టైటాన్స్ స్పిన్ సెన్సేషన్ రషీద్ ఖాన్

గుజరాత్ టైటాన్స్ స్పిన్ సెన్సేషన్, అఫ్ఘాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ తిరిగి ఫామ్ అందుకున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో రషీద్ ఖాన్(3/17) వికెట్లతో గుజరాత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ విన్నర్, ఇన్ ఫామ్ బ్యాటర్ సమీర్ రిజ్వీతో పాటు నితీష్ రాణా, కెప్టెన్ అక్షర్ పటేల్‌లను రషీద్ తన స్పిన్‌తో బోల్తా కొట్టించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.సమీర్ రిజ్వీని క్లీన్ బౌల్డ్ చేసిన విధానం ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. సుదీర్ఘ విరామం తర్వాత మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చడంపై రషీద్ ఖాన్ సంతోషం వ్యక్తం చేశాడు. సమీర్ రిజ్వీని రాంగ్ డెలివరీతో బోల్తా కొట్టించానని చెప్పిన రషీద్.. అక్షర్ పటేల్ వికెట్ కోసం ముందే ప్లాన్ చేశానని వెల్లడించాడు.'ఈ మ్యాచ్ సాగిన విధానం చాలా సంతోషాన్నిచ్చింది. ఈ ఉత్కంఠ పోరులో గెలవడం మరింత ఆనందాన్ని ఇచ్చింది. ఈ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు నాకు చాలా ప్రత్యేకం. గత 7-8 నెలల విరామం తర్వాత రీఎంట్రీ ఇవ్వడం, మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేయడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం నా శరీరం బాగా సహకరిస్తోంది. నా ఆత్మవిశ్వాసం కూడా రెట్టింపు అయ్యింది. సరైన ప్రదేశాల్లో బంతులు వేస్తూ రెండు వైపులా స్పిన్ చేయడానికి ప్రయత్నిస్తున్నాను. ఈ మ్యాచ్‌లో నా బెస్ట్ వికెట్ సమీర్ రిజ్వీని ఔట్ చేయడమే. చాలా రోజుల తర్వాత నాకు ఇలాంటి వికెట్ దక్కింది. ఒక లెగ్ స్పిన్నర్‌గా.. రాంగ్ డెలివరీ(గూగ్లీ)తో బ్యాటర్‌ను బోల్తా కొట్టించి వికెట్ తీయడం అనేది ఎప్పుడూ గొప్ప అనుభూతే. ఇది నాకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. అక్షర్ పటేల్ వికెట్ కోసం ప్రాక్టీస్‌లోనే ప్లాన్ చేశాను. నేను ఆఖరి ఓవర్ వేస్తున్నప్పుడు అక్షర్ పటేల్ క్రీజులో ఉంటే.. రిస్క్ తీసుకోవాలనుకున్నాను. అతను బౌండరీ



బాదినా.. వికెట్ తీయడమే ముఖ్యమని భావించాను. సరైన లైన్ అండ్ లెంగ్త్‌లో బంతిని వేయడంతో అతని వికెట్ దక్కింది. ఇది అత్యంత ఉత్కంఠభరితమైన మ్యాచ్‌ల్లో ఒకటి. గత నాలుగైదు ఏళ్లుగా గుజరాత్ టైటాన్స్ జట్టు ఇలాంటి క్లోజ్ గేమ్స్‌లో భాగమవుతూనే ఉంది. దాంతో చివర్లో భావోద్వేగాలను అదుపు చేసుకోగలిగాం. ప్రతి బంతిపై ఏకాగ్రత పెట్టడం, మన వంతు వంద శాతం కష్టపడటం, బ్యాటర్ కొట్టడానికి కష్టమయ్యే బంతులు వేయడంపైనే మేం దృష్టి పెట్టాం.

# ఐపీఎల్‌లో సరికొత్త రూల్!



సాధారణంగా ఐపీల్ మ్యాచ్‌ల సమయంలో డగౌట్‌లో ఉండే ఆటగాళ్లు పదే పే మైదానంలోకి రావడం చూస్తూనే ఉంటాం. డ్రింక్స్ అందించడానికో, బ్యాట్లు మార్చడానికో, లేదా కోచ్ చెప్పే సమాచారాన్ని చేరవేయడానికో వస్తూ ఉంటారు. అయితే దీని వల్ల మ్యాచ్ సమయం వృథా అవుతుందని గ్రహించిన బీసీసీ సరికొత్త రూల్స్ తీసుకొచ్చింది. ఇందులో భాగంగా మ్యాచ్ ప్లేయింగ్ కండిషన్స్‌లో మార్పులు చేసింది. బీసీసీఐ తాజాగా ఫ్రాంచైజీలకు పంపిన సమాచారం ప్రకారం... మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇచ్చిన టీమ్ షీట్‌లో చెప్పిన 16 మంది ఆటగాళ్లకు మాత్రమే అంటే 11మంది జట్టు సభ్యులు ఐదుగురు సబ్‌స్టిట్యూట్లకు మాత్రమే మైదానంతో సంబంధం ఉంటుంది. ఈ 16 మందిలో లేని మిగతా స్క్వాడ్ సభ్యులలు ఎవరూ కూడా ఆట జరుగుతున్న సమయంలో మైదానంలోకి అడుగు పెట్టడానికి లేదు. సాధారణంగా రిజర్వ్ ప్లేయర్లు డ్రింక్స్ లేదా సమాచారాన్ని తీసుకెళ్తుంటారు. కానీ కొత్త రూల్స్ ప్రకారం టీమ్ షీట్‌లో లేని ఆటగాళ్లు డ్రింక్స్, బ్యాట్లు లేదా ఎలాంటి సందేశాలు పట్టుకొని రావడానికి లేదు. మ్యాచ్ జరుగుతున్న టైంలో కేవలం ఐదుగురు సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు మాత్రమే మైదానం చుట్టూ తిరగడానికి అనుమతి ఉంటుంది. మిగిలిన వారు కచ్చితంగా డగౌట్‌కే పరిమితం కావాలి. వారు బౌండరీ లైన్, ఎల్‌ఈడీ అడ్వర్టైజింగ్ బోర్డుల మధ్య తిరగడానికి లేదు. మైదానం లోపల లేదా బౌండరీ పరిసరాల్లో ఉండే సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు కచ్చితంగా టీమ్ ట్రైనింగ్ బిబ్స్ ధరించాలి. ఇది వారి ఆడుతున్న ఆటగాళ్ల నుంచి వేరుగా గుర్తించడానికి సహాయపడుతుంది. ఈ కొత్త మార్పులు ఇప్పటికే ఉన్న మ్యాచ్ ప్లేయింగ్ కండిషన్స్‌లోని క్లాజ్ 11.5.2, 24.1.4లకు అదనంగా చేర్చారు. క్లాజ్ 11.5.2 ప్రకారం వికెట్ పడినప్పుడు లేదా బౌండరీ వద్ద మాత్రమే సమయం వృథా కాకుండా డ్రింక్స్ అందించాలి. అంపైర్ల అనుమతి లేకుండా కూల్స్ డ్రింక్స్ మైదానంలోకి తీసుకురాకూడదు. క్లాజ్ 24.1.4 ప్రకారం మ్యాచ్‌లో ఆడని ఆటగాళ్లు మైదాన ప్రాంతంలో ఉన్నప్పుడు తప్పనిసరిగా బిబ్స్ ధరించాలని స్పష్టం చేస్తుంది. ఈ రూల్ వల్ల జట్ల వ్యూహాలై ప్రభావం పడే అవకాశం ఉంది.

# చెన్నై జట్టును తక్కువ అంచనా వేయలేం



## • సన్‌రైజర్స్ స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్

ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే 13 మ్యాచ్‌లు ముగియగా, జట్ల మధ్య పోరు హోరాహోరీగా మారుతోంది. ఈ క్రమంలో ఏప్రిల్ 18న హైదరాబాద్‌లోని ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ , చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య బిగ్ ఫైట్ జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు అందరి ఫోకస్ ఎంఎస్ ధోనీపైనే ఉంది. గాయం కారణంగా ధోనీ ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ చెన్నై జట్టుపై చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ధోనీ లేకపోవడం సీఎస్‌కే బలాన్ని తగ్గిస్తుందని తాను భావించడం లేదని క్లాసెన్ స్పష్టం చేశారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఐపీఎల్‌లో అద్భుతమైన రికార్డు ఉందని, వారు ఎప్పుడూ పటిష్ఠమైన జట్టుగానే బరిలోకి దిగుతారని హెన్రిచ్ క్లాసెన్ పేర్కొన్నారు. "ధోనీ మైదానంలో లేనంత మాత్రాన ఆ జట్టు బలహీనపడదు. వారి సెటప్‌లో ఉన్న ప్రతి ఆటగాడు ప్రతిభావంతుడే. విదేశీ ఆటగాళ్లతో పాటు స్వదేశీ కుర్రాళ్లు కూడా మ్యాచ్‌ను గెలిపించగలరు" అని క్లాసెన్ అభిప్రాయపడ్డారు. జియోస్టార్ ప్రెస్ రూమ్‌లో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన సీఎస్‌కే జట్టుపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ధోనీ లేకపోవడం వల్ల తమ పని సులభం అవుతుందని తాము అనుకోవడం లేదని ఆయన తెలిపారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టును మరో కీలక ఆటగాడి రాకతో మరింత బలం పెరిగినట్లయ్యింది. దక్షిణాఫ్రికా యువ సంచలనం డెవాల్డ్ బ్రెవిస్ గాయం నుంచి కోలుకుని జట్టుతో చేరబోతున్నాడని క్లాసెన్ వెల్లడించారు. ధోనీలాగే బ్రెవిస్ కూడా ప్రాక్టీస్ సెషన్‌లో గాయపడటం వల్ల మొదటి మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. బ్రెవిస్ మిడిల్ ఆర్డర్‌లో వస్తే చెన్నై బ్యాటింగ్ మరింత బలోపేతం అవుతుందని, అది తమ బౌలర్లకు సవాల్‌గా మారుతుందని క్లాసెన్ చెప్పుకొచ్చారు. క్లాసెన్ తన సొంత దేశపు ఆటగాడైన బ్రెవిస్ సామర్థ్యం గురించి మేనేజ్‌మెంట్‌ను హెచ్చరించారు. చెన్నై జట్టు టాప్ ఆర్డర్ గురించి మాట్లాడుతూ క్లాసెన్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కొత్తగా జట్టులో చేరిన సంజు శామ్సన్ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేదు. అయితే ఇలాంటి క్లాస్ ప్లేయర్లు ఎప్పుడైనా ఫామ్ అందుకునే అవకాశం ఉందని, వారు ఫామ్ లోకి వస్తే ఆపడం చాలా కష్టమని అన్నారు. వారు తమపై జరిగే మ్యాచ్‌లో కూడా ఫెయిల్ కావాలని తాము కోరుకుంటున్నామని, తద్వారా చెన్నైని ఒత్తిడిలోకి నెట్టవచ్చని క్లాసెన్ నవ్వుతూ వ్యాఖ్యానించారు.

# క్వార్టర్స్‌కు ఆయుష్



నింగ్బో (చైనా) : బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో మూడో రోజు భారత్‌కు నిరాశే ఎదురైంది. రెండో రోజు ఏకపక్ష విజయాలతో ప్రిక్వార్టర్స్ చేరిన సింగిల్స్ షట్లర్లలో యువ సంచలనం ఆయుష్ శెట్టి మినహా మిగిలినవారంతా రెండో రౌండ్‌కే ఇంటిబాట పట్టారు. హెచ్ఎస్ ప్రణయ్, పీవీ సింధు, ఉన్నతి హుడా నిరాశపరిచారు. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ 20వ ర్యాంకర్ ఆయుష్.. 21-16, 21-12తో తనకంటే మెరుగైన ర్యాంకు (20) కల్గిన చైనీస్ తైపీ షట్లర్ చియు జెన్‌ను ఓడించాడు. భుజం గాయం నుంచి కోలుకుని ఇటీవలే రీఎంట్రీ ఇచ్చిన ప్రణయ్.. 12-21, 19-21తో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా) చేతిలో అపజయం పాలయ్యాడు. రెండుసార్లు ఒలింపిక్ విజేత సింధు.. 18-21, 8-21తో రెండో సీడ్ వాంగ్ జియి (చైనా) జోరు ముందు నిలువలేకపోయింది. ఉన్నతి హుడా 17-21, 9-21తో మియజకి (జపాన్) చేతిలో చిత్తైంది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో ధృవ్ కపిల, తనీషా క్రాస్టో జంట 13-21, 14-21తో నాలుగో సీడ్ మలేషియా జోడీ చెంగ్ టాంగ్ జీ, తొ ఈ వీ చేతిలో ఓడింది. మహిళల డబుల్స్‌లో ప్రియా, శృతి కూడా రెండో రౌండ్‌కే నిష్క్రమించారు.

# నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్

## ఉత్తమ నటులుగా నాగచైతన్య, రష్మిక

భారతీయ సినీ పరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా భావించే ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్ 2026 విజేతలను ప్రకటించారు. ప్రతి ఏడాది దేశంలోని పలు భాషల చిత్ర పరిశ్రమలను ఒక వేదికపైకి తీసుకువచ్చే ఈ అవార్డులు, ఈసారి కూడా విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలుగు విభాగంలో యువసామ్రాట్ నాగచైతన్య 'తండేల్' సినిమాలో తన నటనకు గాను ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అలాగే రష్మిక మందన్న 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో ఉత్తమ నటిగా అవార్డు అందుకోనుంది. ఇప్పటికే ఈ ఇద్దరూ తెలంగాణ గద్దర్ అవార్డ్స్‌లో ఉత్తమ నటీనటులుగా గుర్తింపు పొందగా, ఇప్పుడు ఎఔఅంలో కూడా అదే కేటగిరీలో విజేతలుగా నిలవడం విశేషం. ఇక తెలుగు విభాగంలో ఉత్తమ దర్శకుడిగా అనిల్ రావిపూడి 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి గాను ఎంపికయ్యారు. అదే సినిమాలో నటించిన మాస్టర్ రేవంత్ (బుల్లిరాజు)కు ఉత్తమ హాస్యనటుడిగా అవార్డు లభించింది. హీరో తేజ సజ్జా నటించిన మిరాయ్ ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఈ సినిమాకే బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలోనూ అవార్డు రావడం విశేషం. ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా రామ్ జగదీష్ ('కోర్ట్') ఎంపికయ్యారు. ఇతర భాషల్లో కూడా పలువురు ప్రముఖులు అవార్డులు సొంతం చేసుకున్నారు. తమిళంలో దుల్కర్ సల్మాన్ ఉత్తమ నటుడిగా, సిమ్రాన్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. కన్నడలో రిషబ్ శెట్టి 'కాంతార: చాప్టర్ 1' చిత్రంతో ఉత్తమ నటుడు, దర్శకుడు అవార్డులు అందుకోగా, అదే సినిమా ఉత్తమ చిత్రంగా కూడా నిలిచింది. మలయాళంలో నివిన్ పౌలీ ఉత్తమ నటుడిగా నిలిచారు. హిందీలో రణవీర్ సింగ్ ఉత్తమ నటుడిగా, యామీ గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఏప్రిల్ 16న ముంబైలో జరగనుంది. ఈ వేడుకకు టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి మరియు బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ హోస్టులుగా వ్యవహరించనున్నారు. సీనియర్ నటి రేఖ, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.






# 'డెకాయిట్'తో కొంచెం రొమాన్స్ .. మరి కొంచెం యాక్షన్ : మృణాల్!

వెండితెరపై బంగారు తీగలా కనిపించే హీరోయిన్స్ ను చూస్తూ ప్రేక్షకులు కదలడం మరిచిపోతుంటారు .. ఒక్కోసారి కథను కూడా మరిచిపోతుంటారు. హీరోయిన్స్ గ్లామరస్ గా కనిపించాలనే ఆడియన్స్ కోరుకుంటారు. ఇక పాత్రను బట్టి వాళ్ల నటన కనెక్ట్ కావడం .. కాకపోవడం జరుగుతూ ఉంటుంది. అయితే హీరోయిన్స్ మాత్రం గ్లామరస్ గా కనిపించడం కంటే, కాస్త బరువైన .. లోతైన పాత్రలను చేయడానికే ఆసక్తిని కనబరుస్తూ ఉంటారు. అలాంటి ఒక డిఫరెంట్ రోల్ తనకి 'డెకాయిట్'లో లభించినందుకు మృణాల్ ఠాకూర్ చాలా మురిసిపోతోంది. అడివి శేష్ జోడీగా ఆమె చేసిన ఈ సినిమా, రేపు విడుదలవుతోంది. ఈ సినిమాలో తన పాత్ర చాలా లోతైనదిగా కనిపిస్తుందని ఆమె ఇంటర్వ్యూలలో చెబుతూ వచ్చారు. ఒక పాపకు తల్లిగా తాను కనిపిస్తాననీ, బరువైన ఆ పాత్ర సహజత్వానికి చాలా దగ్గరగా ఉండటం వలన, వెంటనే ఆ పాత్రలో లీనమైపోయేదానినని అన్నారు. ఇక ఈ సినిమాలో రొమాన్స్ తో పాటు యాక్షన్ దృశ్యాలలోను తాను నటించానని చెప్పారు. ఈ రెండింటిలో రొమాన్స్ సీన్స్ లో చేయడమే తనకి కష్టంగా తోచిందని అన్నారు. మృణాల్ ఠాకూర్ లో మంచి నటి ఉందనే విషయాన్ని 'సీతారామం' నిరూపించింది. ఆ సినిమా ఆమెకి సక్సెస్ తో పాటు, మంచి పేరు తెచ్చిపెట్టింది. ఆ తరువాత ఆమె చేసిన సినిమాలేవీ మళ్లీ ఆ స్థాయిలో మాట్లాడుకునేలా చేయలేకపోయాయి. 'ది ఫ్యామిలీ స్టార్' ఆమె అభిమానులను బాగా నిరాశపరిచింది. ఆ తరువాత ఆమె నుంచి వస్తున్న ఈ సినిమా, భారీ హిట్ అందుకోవడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది.

# రేణు దేశాయ్‌పై అసభ్యకర కామెంట్..

## గుంటూరు వ్యక్తి అరెస్ట్



నటి రేణు దేశాయ్ సోషల్ మీడియా రీల్‌పై అసభ్యకరమైన, అభ్యంతరకరమైన వ్యాఖ్య పోస్ట్ చేసినందుకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ఓ వ్యక్తిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న వేధింపులపై రేణు దేశాయ్ ఇటీవల చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు.

చెన్నయ్య రుంజాల అనే వ్యక్తి తన యూట్యూబ్ ఖాతా నుంచి రేణు దేశాయ్ రీల్‌ను చూసి, దానిపై అనుచిత వ్యాఖ్య చేసినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు తమ దర్యాప్తులో గుర్తించారు. నిందితుడు గుంటూరులో ఉన్నట్లు తెలుసుకుని, అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకుని గచ్చిబౌలిలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో నిందితుడు తన ఫోన్ నుంచే ఆ కామెంట్ పెట్టినట్లు అంగీకరించాడు.

ఆన్‌లైన్‌లో తనపై అసభ్యకరంగా మాట్లాడుతున్న వారిపై, తన వ్యక్తిగత జీవితంలోకి చొరబడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రేణు దేశాయ్ ఈ నెల ప్రారంభంలో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో విడాకులైనప్పటి నుంచి తాను వేధింపులు ఎదుర్కొంటున్నానని ఆమె గతంలో తెలిపారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అసభ్యకరమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయవద్దని అధికారులు హెచ్చరించారు. అభ్యంతరకరమైన కంటెంట్ పోస్ట్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సైబర్ నేరాల గురించి 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సమీప సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

# రాకాలో అల్లు ద్విపాత్రాభినయనం

## రమ్యకృష్ణ కూడా కీ రోల్




అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది. ఈ చిత్రంలో దీపిక పదుకొణెళి ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. 'పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి' అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.

---------

# హారర్ కామెడీతో కొరియన్ కనకరాజు

వరుణ్ తేజ్ కథానాయకుడిగా రానున్న చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితికా నాయక్ కథానాయిక. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. హారర్ కామెడీ కథకి ఇండియా – కొరియా నేపథ్యాన్ని జోడించి రూపొందిస్తున్న చిత్రమిది. తమన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ ఇస్తూ టీమ్ ఫన్నీ వీడియోను విడుదల చేశారు. ఏప్రిల్ 11న ఈ పాటను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సాంగ్స్ 'ఓజీ' స్థాయిలో ఉండాలని తమన్‌తో వరుణ్‌తేజ్ సరదాగా చెప్పారు.




# 'ఐకాన్ స్టార్' అల్లు అర్జున్ కు రైటర్ సత్యదేవ్ జంగా బర్త్డే విషెస్ !!!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా టాలెంటెడ్ రచయిత సత్యదేవ్ జంగా ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. "రాకా" ఫస్ట్ లుక్ ను కూడా ఈసందర్భంగా అప్రిషియేట్ చేశారు.

సత్యదేవ్ జంగా నాని నటించిన శ్యామ్ సింగా రాయ్ సినిమాకు రచయితగా పని చేసిన విషయం తెలిసిందే, త్వరలో ఒక క్రేజీ ప్రాజెక్ట్ తో సత్యదేవ్ జంగా రాబోతున్నారు. వాటి వివరాలు త్వరలో ప్రకటించబోతున్నారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613